POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఫిబ్రవరి 2022
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 39 సంచిక: 10



సద్గురు శ్రీ భరద్వాజ మహారాజ్ బ్రహ్మానుభూతి పర్వదినం (9-2-2022)
సందర్భంగా అందరికీ గురుదేవుల ఆశీస్సులు లభించాలని ప్రార్థన!

# ಶ್ರೀ ಸಾಯಿ ಲೀಲಾಮೃತ

## ಶ್ರೀ ಶಿರಡಿ ಸಾಯಿಬಾಬಾರ ಜೀವನ ಚರಿತ್ರೆ

### ನಿತ್ಯ ಪಾರಾಯಣ ಗ್ರಂಥ





ರಚನೆ : ಪರಮಪೂಜ್ಯ ಆಚಾರ್ಯ ಶ್ರೀ ಎಕ್ಕಿರಾಲ ಭರದ್ವಾಜ

KANNADA

# సాయిబాబా శిరిడీ విడిచి వెళ్ళిన ఆ రోజు...

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

శ్రీసాయి ప్రత్యక్షంగా దర్శించిన వారిలో ఉత్తమ సంస్కారవంతులైన కొద్దిమంది మాత్రమే వారి దివ్యత్వాన్ని గుర్తించారు. మహల్సాపతి, అప్పాకోతే, కాశీరాం షింపీలు గూడ ఆయనను మొదటనుండే సేవించారు. కాని అందుకు కారణం ఆ గ్రామానికి ఏ సాధువులు, ఫకీర్లు వచ్చినా వారిని సేవించే అలవాటు ఆ ముగ్గురికీ వున్నది. తుకారాము, నామదేవు, జ్ఞానదేవుడు మొ॥న వారి రచనల ద్వారా మహారాష్ట్ర దేశమంతటా సాధువులందరినీ కులమత భేదాలు, పుట్టు పూర్వోత్తరాలు పట్టించుకొనకుండా సేవించడం ముముక్షువులకెంతో మంచిదన్న భావం ప్రచారమైంది. నదుల విషయంలోను, మహాత్ముల విషయంలోను వారి పుట్టుపూర్వోత్తరాల గురించి విచారణ తగదన్న ఆర్యోక్తి గూడ ఆ దేశంలో లోక విదితమైంది.అందువల్లనేయీ ముగ్గురు భక్తులూ సాయి శిరిడీ చేరకముందు జానకీదాసును, దేవీదాసును గూడ సేవించారు. జానకీదాసును గురువుగా భావించాడు కాశీరాం షింపీ. ఉత్తర భారతదేశంలో వలెనే మహారాష్ట్రంలో గూడ నాథసంప్రదాయం ఎంతగానో వ్యాపించింది. నాథ యోగులకు హిందు-ముస్లిం అనే మత భేదం గూడా లేదు. దాని ప్రభావంవల్లనే అచటి ప్రజలకు ముస్లిం మహాత్ములనుగూడ ఆరాధించే విశాల దృష్టి వున్నది. అందువల్లనే యీ ముగ్గురూ సాయి ముస్లిం అన్న భావంతోగూడ ఆయనకు దూరంగా లేడు. కాకుంటే ప్రజలలో ముముక్షువులెప్పుడూ కొద్దిమందే ఉంటారు. కనుకనే హృదయపూర్వకంగా సాధువులను సేవించేవారెప్పుడూ కొద్ది సంఖ్యలోనే వుంటారు. అట్టివారే మొదటి నుండీ సాయిని సేవించిన మహాల్సాపతి ప్రభృతులు. అయితే శిరిడీ గ్రామస్థులలో మొదట జానకీదాసు, దేవీదాసు మరియు గంగగిర్‌బువాలను ఆదరించేవారే ఎక్కువమంది వుండేవారు. సాయివద్దకు యీ ముగ్గురు మాత్రమే వెడుతుండేవారు. చాంద్‌పాటిల్ తాను చూచిన సాయిలీల గురించి చెప్పినందువలన, మరియు ఆయన ముస్లిమన్న భావంతో మాత్రమే కొద్దిమంది ముస్లింలుగూడ ఆయనను ఆదరించేవారు. కాని ఆ మతంలో మహాత్ములను సేవించే సంప్రదాయం అంత బలంగా లేదు. గనుకనే యీనాటికీ ముస్లిం మహాత్ములను సేవించేవారు ఆ మతంలో స్వల్ప సంఖ్యలో వుంటారు. స్థానిక హిందువులలో గూడ సాయిని సేవించేవారు కొద్దిమందే వుండడానికి మరొక కారణమున్నది. ఆయన ప్రవర్తన, మాటలు, చేష్టలు వింతగా వుండేవి. అప్పుడప్పుడూ నిష్కారణంగా కోపించడం, తమలో తాము గొణుక్కుంటూ చిత్రమైన భంగిమలు చేస్తూండడం, ఎదుట ఎవరూ లేకున్నా తిడుతూండడం వలన అందరూ ఆయన పిచ్చివాడనుకునేవారు. ఆయనను గంగగిర్‌బువా, ఆనందనాథ్ మహరాజ్ వంటి మహాత్ములు ప్రశంసించినా, మశీదులో ఆయన నీటితో దీపాలు వెలిగించినా గూడ ఎక్కువమంది గ్రామస్థులు ఆయనకు దూరంగా వుండేవారు. దానికి గల కారణం - ఆయన కొన్ని అతీత శక్తులు సాధించినప్పటికీ ఆయన పిచ్చివాడనుకునేవారు. ఆయన కీర్తి వ్యాపించి ఆయననెందరో దర్శిస్తున్న కాలంలో గూడా నార్కేవంటి భక్తులకు యిట్టి సంశయం తలెత్తుతూనే వుండేది.

తరువాత కాలంలో సాయిని సన్నిహితంగా గమనించిన వారికి వాస్తవం అర్థం కాసాగింది. ప్రజల హృదయాలలోని భావాలు సాయికి తక్షణమే తెలుస్తుండేవి. అన్ని జీవుల హృదయాలలోను వుండే యీర్ష్యాద్వేషాది మలినభావాలు ఆయననెంతగానో బాధిస్తుండేవి. నిష్కారణంగా ప్రకటమైనట్లు కన్పించే వారి కోపానికీ, తిట్లకూ కారణమదేనని భక్తులు గుర్తించసాగారు. ఆ ప్రాంతంలో

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 ఫిబ్రవరి-2022 సంచిక:10

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **సాయిబాబా శిరిడీ విడిచి వెళ్ళిన ఆ రోజు...** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **"ఈ సొమ్ము మాధవునికొక లెక్కలోనిదా"** | (సేకరణ) ఒక రాజమండ్రి పాఠకుడు | 06 |
| 03. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 07 |
| 04. | **మానవత్వమా?..... దైవత్వమా?** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 05. | **సిద్ధయ్య** | శ్రీమతి శ్రీదేవి | 11 |
| 06. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 07. | **మాతృదేవి స్మృతులు** | శ్రీ అడిదం శ్రీకాంత్ | 16 |
| 08. | **ప్రేమ స్వరూపుడు** | శ్రీ కె. ఎస్.ప్రసాద్ | 19 |
| 09. | **అబ్దుల్లా జాన్** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 23 |
| 10. | **ద్వారకామాయి అనుభవమండపము** | శ్రీ ఏ. రాంబాబు | 25 |
| 11. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీమతి మునీలా | 26 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ప్లేగు మొ॥న అంటు వ్యాధులు చెలరేగబోయే ముందు గూడ ఆయనలో అట్టి ఆవేశం ప్రకటమౌతుందని వారు గమనించారు.

భక్తులు అధిక సంఖ్యలో ఆయనను చేరి సేవించనారంభించాక గూడ తమ కోపానికి కారణమేమో అడిగిన భక్తులకు సాయి చెప్పేవారు. ఒక్కొక్కప్పుడు ఆయన ఆగ్రహించి ఆ గ్రామం విడిచి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యేవారు. అందుకు కారణమడిగిన మహల్సాపతి మొ॥న వారితో, "నూనె వ్యాపారస్థులు, వర్తకులు నన్నెంతో బాధించారు. నేనిక్కడ వుండను; ఎక్కడికైనా వెళ్ళిపోతాను" అని బయలుదేరేవారు గూడా. అప్పుడు ఆ సన్నిహిత భక్తులు పసిపిల్లలకు బుజ్జగించి నచ్చజెప్పినట్లు నచ్చజెప్పి ఆయనను వూరుకోబెట్టేవారు. ఒక్కొక్కప్పుడు అలాంటి భక్తులెవరూ దగ్గర లేనప్పుడు ఆయన శిరిడీ వెళ్ళిపోవడానికి బయలుదేరేవారు. తరువాత ఆ సంగతి తెలిసి, యీ సన్నిహిత భక్తులాయన వెంటపడి మళ్ళీ వెనుకకు తీసుకొచ్చేవారు. ఇందుకొక వుదాహరణ :

ఒకరోజు అకస్మాత్తుగా సాయి శిరిడీలో కన్పించలేదు. ఆ విషయం వెంటనే పరుగునపోయి ఒకరు మహల్సాపతితో చెప్పారు. ఆ సమయంలో అతడు ఖండోబా ఆలయంలో పూజ చేస్తున్నాడు. వెంటనే వచ్చి అతడు గ్రామంలో విచారించగా సాయి రహతా వైపుగాని, లేక నీమ్‌గావ్ వైపుగాని వెళ్ళలేదని, ఆ గ్రామం నుండి బయలుదేరేప్పుడు సాయి అతి తీవ్రమైన కోపావేశంతో వున్నారని అచటివారు చెప్పారు. ఆయన లిండీదాటి రోడ్డు మీద వుత్తరం దిక్కుగా నడవడమెవరో చూచారు. వెంటనే మహల్సాపతి నీమ్గావ్ వైపుకు కొద్దిదూరం వెళ్ళి, ఆ రోడ్డుమీద ఎదురైన వారిని విచారించాడు. కాని సాయి ఆ గ్రామానికి రాలేదని వారు చెప్పారు. మహల్సాపతి హతాశుడయ్యాడు. తనకు ప్రాణ సమానుడై ఆ మహాత్ముడు శాశ్వతంగా తనకు దక్కకుండా పోయారేమోనని భయపడ్డాడు. నీమ్‌గావ్ వెళ్ళే రోడ్డు మీద నుంచి తూర్పుగా రూయీ గ్రామానికి వెళ్లే డొంకన కొంతదూరం నడచి, అక్కడొక పొలంలో పని చేసుకుంటున్న వారిని విచారించగా సాయి రూయీ గ్రామం వైపుగా వెళ్ళారని వారు చెప్పారు. ఆయన తీవ్రమైన కోపావేశంలో వున్నారని, వారాయనను పల్కరించినప్పుడు ఆయన శిరిడీ గ్రామస్థులను తిట్టిపోసి తిరిగి ఆ గ్రామానికి తాము రాబోమని చెప్పారని అన్నారు. మహల్సాపతి హృదయంలో ఆ వార్త వినగానే ఆశాజ్యోతి పొడసూపింది. అతడు తిరిగి వెంటనే యిల్లుచేరి, తాను రూయీ గ్రామంలో సాయి చెంతకు వెడుతున్నానని, ఆయన తిరిగి రాకుంటే తానుగూడ తిరిగి రాబోనని తన భార్యకు చెప్పి దృఢనిశ్చయంతో రూయీకి బయలుదేరాడు. నాటివరకు శిరిడీకి పట్టిన మహద్భాగ్యం ఆ గ్రామాన్ని విడిచి పెట్టిందేమోనని భయపడ్డాడు. అయితేనేమి, తాను మాత్రం ఆ మహాత్ముని సేవ – సాన్నిధ్యాలు ఎట్టి పరిస్థితిలోను వదులుకోదలచలేదు.

అతడు రూయీ చేరే సరికి ఆ గ్రామ ప్రవేశంలోనే వున్న మారుతి ఆలయం ముందు సాయి ఒక చెట్టు క్రింద కూర్చొని కనిపించారు. ఆయన మహల్సాపతిని చూస్తూనే ఉగ్రులై, అతనిని మరియు ఆ గ్రామస్థులను తిట్టి అతనిని తమ చెంతకు రావద్దనీ, తిరిగి యింటికి పొమ్మని కేకలు వేశారు. అతడు నడక వేగం తగ్గించి నెమ్మదిగా ఆయనను సమీపించాలని యత్నిస్తూంటే సాయి అతనిపై రాళ్ళు విసిరారు. చివరకతడు, "నేను మీ భగత్‌ను. మీరు నన్ను చంపినా సరే మీ సన్నిధి విడిచి పెట్టను. శిరిడీలో మిమ్మల్ని బాధించిన వారిని నేను దండిస్తాను. మీకు శిరిడి రావడం యిష్టం లేకపోతే నేను గూడ మీతో పాటు యిక్కడే వుండిపోతానుగానీ మిమ్మల్ని విడిచిమాత్రం వెళ్ళిపోను. ఆ మాట యింట్లో వారికి గూడ చెప్పి వచ్చేశాను!" అన్నాడు మహల్సాపతి. అతని పట్టుదల చూచి సాయి రాళ్ళు రువ్వడం మానివేశారు గాని అతనినెంతకూ తమ పాదాలంటనివ్వలేదు. క్రమంగా అతనిని తిట్టడం మాని శిరిడీ గ్రామస్థులను మాత్రం తిట్టి, "నేనిక ఆ గ్రామానికి రాను. నేను ఫకీరును. మేమెక్కడికైనా ఎప్పుడైనా వెళ్ళవచ్చు. నీవు సంసారివి. ఇల్లు విడిచి యిలా మావెంట రాగూడదు. నీవు తిరిగి యింటికి పో!" అని పదే పదే చెప్పారు. వారి కంఠంలో తొణికిసలాడిన నిశ్చయం చూచి మహల్సాపతి ఆశ్చర్యచకితుడయ్యాడు. చివరకు ఆయన తనతోగూడా శిరిడీ వస్తేగానీ అన్నం, నీళ్ళు ముట్టనని చెప్పి ఆయన చెంతనే కూర్చున్నాడు. ఆయన మళ్ళీ అతనిని తిట్టిపోశారు; మందలించారు; హితం చెప్పారు. కనీసం గ్రామంలోకి వెళ్ళి భోజనమైనా చేయమని బ్రతిమాలారు. సాయంత్రం వరకూ యిద్దరిమధ్య యిదే నాటకం నడిచింది. చివరికి భక్తుని మాటే నెగ్గింది, ఆ యిద్దరూ తిరిగి శిరిడీ చేరారు. మనందరికీ సాయి తిరిగి లభించారు. శిరిడీ దర్శనం అందుకే లభిస్తోంది. •

# "ఈ సొమ్ము మాధవునికొక లెక్కలోనిదా?"

*(సేకరణ) ఒక రాజమండ్రి పాఠకుడు*

సాయి భౌతిక దేహముతో యుండగా బొంబాయి, హైదరాబాదుల నుండి ఎందరో తెలుగువారు సాయిని దర్శించి, సేవించి యుంటారు. కాని వివరములు మనకు తెలియదు. బొంబాయిలో స్థిరపడిన ఒక ఆంధ్రుని గూర్చి సాయి చరిత్రలో కనిపిస్తుంది. ఈయన మాధవభట్టనే పురోహితుడు, సంపన్నుడు. కలవారి ఇండ్లలో జపధ్యానములు, పూజలు, రుద్రాభిషేకము మొ॥నవి చేసేవాడు. అటువంటి గృహములలో సాయి భక్తుడైన మోరేశ్వర్ విశ్వనాథ ప్రధాన్ ఇల్లు ఒకటి. 1912 సం॥ ప్రాంతములో 4సం॥ల వయస్సుగల ప్రధాన్ కుమారుడు "బాబు" కు ఎంతో జబ్బు చేసింది. ఈ భట్టుగారు పూజలు, జపాలు, రుద్రాభిషేకములు వగైరా ఎన్నో చేశాడు. ఏమీ ఫలితము కలుగలేదు. ఇంక ఖచ్చితంగా ఇది ప్రధాన్ ఒక ముస్లిము సాధువును ఆరాధించటం వలన హిందూ దేవునికి (శివునికి) కలిగిన కోపము ఫలితమేననుకొన్నాడు. పైకి ఆ సంగతి ఎవరితోనూ అనే ధైర్యములేదు. తానలా అన్నానని ప్రధాన్‌కు తెలిస్తే ఇంకేమైనా ఉందా? సాక్షాత్తు సగుణబ్రహ్మమే అని నమ్మిన సాయి తన కుమారుని జబ్బుకు కారణమంటే సహిస్తాడా? ఆయన భార్య సంగతి ఇంక చెప్పనక్కరలేదు, మహా భక్తురాలేగాని కోపము ఎక్కువ. ఒకటంటే పది సమాధానాలు చెబుతుంది. ఇద్దరూ కలిసి "మాధవభట్టుగారూ! మాకు మీ పూజలు వద్దు. మీరు వద్దు మా యింటి గడప ఇంక తొక్కవద్దు మీకొక నమస్కారం" అంటారు. ఆ కుటుంబముతో ఉన్న అనుబంధము తెగిపోతుంది. ఒక వంక బాబుకు జ్వరము తగ్గటం లేదు. ఇదంతా ఏమిటో అగమ్యగోచరంగా వుంది. అదే ఆలోచిస్తూ నిద్రపోయాడు. స్వప్నములో బాబా ఆ యింటి మెట్లపై కూర్చొని చేతితో సటకా ఊపుతూ "నేనెవరను కొంటున్నావో, జాగ్రత్త! నేనే ఈ యింటికి యజమానిని, ఈ బిడ్డ నా వరప్రసాదము, నీవేమి బాగుచేయగలవు?" అన్నారు. భట్టు కంగారు పడుతూ నిద్రలేచాడు. కాని ఎవరితో చెప్పుకొంటాడు? ఇంక ఒక్కటే మార్గాంతరము తోచింది. ఉదయమే గోడకున్న సాయిపటం ముందు నిలబడి యిలా ప్రార్థించాడు: "సాయీ! నాకు వచ్చిన స్వప్నం నిజమైతే సాయంత్రానికి బాబుకు జ్వరము తగ్గిపోవాలి. ఆ మాట డాక్టరు చెప్పాలి; బిడ్డ ఆడుకోవాలి. అప్పుడే మీరు దత్తమూర్తి అని నమ్ముతాను; అంతేకాదు 15 రోజులలో మీ దర్శనము చేసుకుంటాను. ఉత్త చేతులతో అనుకొంటారేమో, గట్టి చేతులతోనే. మీకు ₹108/- దక్షిణ సమర్పించుకొంటాను". అంతే! ఒక గంటలో బాబుకు జ్వరము

మిగతా 22వ పేజీలో

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

## ప్రశ్న :-అందరి జ్ఞానేంద్రియాలు ఒకే నిర్మాణం కలిగియున్నప్పుడు వాటిచేత ప్రభావితమయ్యే మనస్సుల తత్వాలు ఎందుకు భిన్నంగా వుంటాయి?

– సి. హెచ్ లక్ష్మీనారాయణ, సంగారెడ్డి

**జవాబు:-** సృష్టి, ప్రళయం అన్నవి ఆద్యంతాలు లేకుండా తిరిగి తిరిగి జరుగుతుంటాయని, ప్రళయానికి ముందున్న జీవులన్నీ వాటి కర్మఫలాలను, సంస్కారాలను అనుసరించి తర్వాత సృష్టిలో ఆయా గుణాలు కల్గిన జీవులుగా, వాటి కర్మఫలాలను ప్రసాదించ సమర్థమైన పరిస్థితులలో, యోనులలో జన్మిస్తాయని, అక్కడ నుండి మరలా 'జననము – కర్మ – కర్మఫలము – సంస్కారము – మరణము – జన్మ' అనే గొలుసు ఎల్లకాలం కొనసాగుతుందని ఋషులు చెప్పారు.

సంస్కార, గుణభేదాల ననుసరించి సత్వ రజస్తమో ప్రధానమైనవిగా జీవులను విభజించవచ్చు. అవి చేసిన మానసిక (భావాలు) వాచక (సత్యాసత్య, వ్యర్థ, దుష్ట భాషణలు), కాయిక (ధర్మబద్ధంగా ఆర్జించబడిన శుద్ధమైన ఆహారాన్ని మాత్రమే భగవంతునికీ, ఆయన రూపాలుగా తలచి సాటి జీవులకూ పెట్టడముగాని, లేక తద్విరుద్ధమైన జీవనంగాని) కర్మలనుబట్టి జీవులలో ఆయా గుణాలు మరింత బలీయమవుతాయి. ఇవే సంస్కారాలు, వాసనలు. వీటి సమిష్టి రూపమే మనస్సు కనుక వ్యక్తికి వ్యక్తికి భిన్నంగా వుంటుంది.

మానవస్థాయిలోనే ఇలాంటి భేదముంటుంది. కారణం తక్కిన తిర్యగ్జాతులలో లేని యోచన, అవగాహనాశక్తులు మనిషి కుంటాయి. జంతువులలో అవి తాత్కాలికమైన జీవితావసరాలకు పరిమితమై మాత్రమే పనిచేస్తాయి. మనిషిలోని యోచనలలో చాలా స్వల్పభాగం మాత్రమే జీవితావసరాల గురించి వుంటాయి. వ్యక్తుల, వస్తువుల గురించిన అభిప్రాయాలు, భూత భవిష్యత్తులను గురించిన ఆశలు, భయాలు, జీవితపు విలువలపట్ల విభిన్న దృక్పథాలు, వాటివలన కలిగిన భేదాభిప్రాయాలు, వాటన్నింటిపట్ల మమకార ద్వేష అసూయాదులు వుంటాయి. ఉదాహరణకు మత, జాతి, వర్గ, భాష, ప్రాంతీయ భావాలు, ఉచ్చనీచాలు మొదలైనవెన్నో ఉంటాయి.

వీటన్నింటికి మూలం యోచనే. అవగాహన పెరిగినకొద్దీ యోచన నిర్దుష్టమై, మంచిని గుర్తించి, ప్రేమించి, ఆచరించి, వృద్ధి చెందించుకునే సామర్థ్యము మనిషికున్నది. అయితే అంతా కర్మఫలాన్ననుసరించే జరిగితే యిక మార్చుకునే స్వేచ్ఛ ఎక్కడిదీ అన్న ప్రశ్న రావచ్చు. మన అవగాహన పెరిగితే కర్మఫలంగా జరిగి తీరవలసిన సంఘటనపట్ల,

**మిగతా 28వ పేజీలో**

*(ఫిబ్రవరి 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# మానవత్వమా?..... దైవత్వమా?

***పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ***

మానవ శ్రేయస్సుకు మానవత్వం గొప్పదా? దైవత్వం గొప్పదా?' అనే ప్రశ్న ఎప్పుడూ వుంటూనే వుంటుంది. కొంతమంది మానవత్వమే గొప్పదంటే, కొంతమంది దైవత్వమే గొప్పదని వాదించుకుంటుంటారు. ఇంతకూ ఏది గొప్పది? అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వారికుండడం సహజమే.కానీ అసలు మానవత్వమంటే ఏమిటి? దైవత్వమంటే ఏమిటి? అనే విషయం గూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమి చెప్పారు?

పరిపూర్ణమానవత్వమేదైవత్వమని పూజ్యశ్రీ మాస్టరుగారు చేప్పేవారు. పరిపూర్ణ మానవత్వమంటే?..... మనిషి మనిషిగా బ్రతకడం. అదేం మాట? మనిషి మనిషిగా బ్రతుకక జంతువుగా బ్రతుకుతున్నాడా ఏమిటి? అసలు జంతువుగా ఎలా బ్రతుకుతాడు? అనే సందేహం కొందరికి రావచ్చు. కానీ ఈనాడు చాలామంది మనుషులు మనుషులుగా బ్రతకడం లేదనడంలో సందేహం లేదు. కారణం 'మనుష్య రూపేణ మృగాః చరంతి" అని భర్తృహరి చెప్పివున్నాడు. అంటే రూపం మనిషిదే కావచ్చు గాని గుణాలు జంతువులవే అని అర్థం. కానీ ఆలోచిస్తే ఇప్పటి కొందరు మనుషులకంటే జంతువులే మేలేమోనని అనిపించక తప్పదు. ఉదాహరణకు కుక్కకు వున్న విశ్వాసం కొంతమంది మనుషులకు వుండదు. అలాగే మరికొన్ని జంతువులకున్న సద్గుణాలు కొంతమంది మనుషులలో లేకపోవచ్చు. అలాగే కొన్ని జంతువులకున్న దుర్గుణాలు కొందరిలో కనిపిస్తాయి. అందుకే మన పెద్దవాళ్ళంటుంటారు, "వీడికి మేలు చేయడం పాముకు పాలు పోసినట్లయింది" అని. అంటే "పాము తనకు ఆహారం పెట్టినవాడినే కాటువేసినట్లు, మనుషులు మేలు చేసినవారికే కీడు తలపెడతారు" అని. ఇలాగే ఎన్నో జంతువుల లక్షణాలు కొంతమంది మనుషులలో కనిపిస్తుంటాయి. అంటే మనిషి రూపంలో మృగాలు సంచరిస్తున్నట్లే కదా!

అలాగే 'తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టేవాడు' అని, 'ఏరు దాటగానే తెప్పను తగలేసిన వాడనీ', 'చెప్పుతినెడి కుక్క', 'పులితోలు కప్పుకున్న నక్క' అనీ, 'కోతి బుద్ధి' అనీ, 'కుక్క బుద్ధి' అనీ – ఇలా ఎన్నో రకాలుగా మనుషుల చెడుతనం గూర్చి చెప్పుకుంటుంటారు. అలాగే మనుషుల మంచితనం గూర్చిగూడ చెబుతుంటారు. 'కుక్కలాగా విశ్వాసంతో పడివుంటాడు' అనీ, 'గాడిదలాగా చాకిరీ చేస్తా' డనీ, :కోయిలలాగా మధురస్వరం కలవా' డనీ!

కాకిలాగా గోల చేస్తాడనీ, గార్దభస్వరం అనీ, చెవికోసిన మేకలాగా అరుస్తుంటాడనీ, జిత్తులమారి నక్క అనీ, అజగరం లాగా ఊరికే పడివుంటాడనీ, నోరులేని జంతువులాగా అనీ – యిలా ఎన్నో ఉపమానాలు. అంటే మానవునికీ, జంతువులకూ గుణాలలో అవినాభావ సంబంధమున్న దన్నమాట. అంతేకాదు. మానవులలో రాక్షసులు గూడా వుంటారనీ నరరూప రాక్షసులనీ, బకాసురుడనీ,

కుంభకర్ణుడనీ, కీచకుడనీ ఇలా రాక్షసులతో గూడ పోల్చారు. అయితే ఇంతకూ మానవత్వలక్షణాలేమిటి?

గొడ్డులాగా చాకిరీ చేయడమా? కుక్కలాగా విశ్వాసంతో పడివుండడమా? నోరులేని జంతువులాగా వుండడమా? ఏమిటి? అంటే - మాస్టరుగారు ఒక సందర్భంలో మానవత్వానికి నిర్వచనం ఇలా చెప్పారు : 'పరిపూర్ణ మానవుడు రాముడిలాగా వుంటాడు' అని. అంటే రాముడిలాగా వుండడమంటే ఏమిటి? శ్రీ రాముని లక్షణాలేమిటి?

శ్రీరామునిలోని సుగుణాలు ఎన్నో! అంటే ఆయనే సుగుణాలరాశి. ఆయన అపార కరుణామయుడు. తల్లిదండ్రుల పట్ల, భార్యాబిడ్డలపట్ల, సేవకులపట్ల, ప్రజలపట్ల, సకల జీవరాశిపట్ల ఆయన ఎంతో ప్రేమగా వుండేవాడు. శ్రీరాముడు ధర్మస్వరూపుడు. ఆయన సకల ధర్మాలను చక్కగా ఆచరించి చూపాడు. శత్రువుల పట్ల ఆయన క్షమాగుణము, తనకు మేలు చేసినవారి పట్ల కృతజ్ఞత, సేవ చేసేవారిపై కరుణ, శరణు పొందినవారిపై క్షమ, పెద్దలు, ఋషుల పట్ల వినమ్రత, కష్టాలలో సహనము, ఎటువంటి పరిస్థితులలోనూ మొక్కవోని ధర్మనిరతి, యాచకులు, ఆశ్రితుల పట్ల దానగుణము, విపత్కర పరిస్థితులలో అపార ధైర్య సాహసాలు -ఇన్నీ ఆయనలో పరిపూర్ణంగా వున్నాయి.

అందుకే ఆయన పరిపూర్ణమానవుడు. దయ, క్షమ, సహనము, ఔదార్యము, ధైర్యము, సాహసము, ఓదార్పు, కృతజ్ఞత, ధర్మనిరతి, అధర్మంపట్ల కఠినత్వము,



సకల జీవులపట్ల ప్రేమ, సహాయము చేయడము - ఇలా ఏవి మానవత్వ లక్షణాలని చెబుతారో అవన్నీ పరిపూర్ణంగా శ్రీరామునిలో వున్నాయి గనుక ఆయన దేవుడు, అవతారపురుషుడు. అంటే పరిపూర్ణ మానవత్వమే దైవత్వమన్నమాట. ఈనాడు ఇలాంటి మానవులు తక్కువ మందే వున్నారని చెప్పవచ్చు. ఈనాడు మానవులలో ఈ దానవత్వ, పశుత్వ లక్షణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మోసాలు, కుట్రలు, కుతంత్రాలు, హత్యలు, దోపిడీలు, దొంగతనాలు ఎక్కువైనాయి. ఒకరిని మించి ఒకరు తమ తెలివితేటలతో మోసం చేయాలనే ప్రయత్నిస్తున్నారు. లౌకిక సుఖాలవేటలో జరిగే యీ అన్యాయాలకు అంతులేకుండా వున్నది. వాటిని చూస్తుంటే, వింటుంటే ఇన్ని రకాలుగా గూడ దుశ్చర్యలు చేయవచ్చా! అని ఆశ్చర్యం కలుగక మానదు. దీనినే దానవత్వమనీ, పశుత్వమనీ అంటారు.

అంటే ఈ ప్రపంచంలో మానవులే లేరా? మానవజాతి నశించిందా? అని కొందరికి అనిపించవచ్చు. పూర్తిగా అలా అనుకోవడానికి వీలులేదు. ఈ మానవత్వమున్న వాళ్ళు అక్కడక్కడా మనకు తారసపడుతూనే వున్నారు. వారినే రామునివలె ధర్మాత్ములనీ, లక్ష్మణునివలె సోదరుడనీ, ఆంజనేయునివలె నమ్మిన బంటనీ యిలా అంటూ వుంటారు. అయితే పరిపూర్ణ మానవత్వం గలవారుగూడ ఈ లోకంలో అవతరిస్తూనే వున్నారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకంగా మానవులలోని రాక్షసత్వాన్నీ, పశుత్వాన్ని తొలగించేందుకు, వారిని

ధర్మనిరతివైపు నడిపించేందుకు ప్రయత్నిస్తూ వున్నారు. వారినే, అటువంటి మానవులనే మనం అవతారపురుషులనీ, మహాత్ములనీ, అవధూతలనీ, బాబాలు, స్వాములు అని పిలుస్తూ దైవస్వరూపులుగా ఆరాధిస్తూ వుంటాము. అంటే మనలో ఎటువంటి గుణాలు వున్నప్పటికీ వారిలోని సద్గుణాలంటే మనకు ఎంతో యిష్టమన్నమాట. అందుకనే ఏదో ఒక కారణంగా వారి చుట్టూ తిరుగుతూ వుంటాము.

అట్టి పరిపూర్ణ మానవత్వంతో, సద్గుణ సంపత్తితో మనమధ్య అవతరించినవారు పూజ్యశ్రీ మాస్టరుగారు. మానవదేహధారియై మనమధ్య సంచరిస్తూ, దైవీ సంపదతో విలసిల్లుతూ, పరిపూర్ణ మానవత్వాన్ని తెలియజేయడానికై గృహస్థాశ్రమంలో వుంటూ, సామాన్య మానవునిలా ప్రవర్తిస్తూ నేటి సమాజంలో గూడ మానవతతో ఎలా వుండవచ్చో తెలియజెప్పడానికి అవతరించారాయన. ఆయన సన్నిహితులకు, స్నేహితులకు, అనుయాయులకు ఆయనలోని సద్గుణాల సంగతి తెలుసు.

లోకంలో ఎందరో ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందినవారు వున్నారు. కానీ వారు కేవలం ఆధ్యాత్మికతకే ప్రాధాన్యతనిస్తూ, నిజమైన ఆధ్యాత్మిక జీవితమే జీవితమనీ, లౌకిక విషయాల పట్ల నిర్లిప్తులై వుండాలనీ సాధ్యమైతే దానిని త్యజించాలనీ గూడ బోధిస్తూ వుంటారు. కొందరు దేనికోసమైనా సరే కేవలం భగవంతుని ఆరాధిస్తే చాలునని చెప్పి మిగతా విషయాలలో ఎలా ప్రవర్తించాలో తెలియజెప్పరు. అందుకని ఆధ్యాత్మికత అంటే కేవలం కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే ఉపయోగపడే సాధనమన్నట్లు ప్రజలలో ఎక్కువమంది భావిస్తున్నారు. అందుకని ఎందరు ఆధ్యాత్మిక వేత్తలను సేవించి ఆరాధించినా వారి సమస్యలు తీరడమేగానీ మనశ్శాంతి లభించడం లేదు. మిగతా విషయాలలో అంటే అహంకార, మమకార, అసూయ, ద్వేషాది విషయాలలో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లున్నది' నేటి భక్తులలో చాలామంది పరిస్థితి. మరి దీనికి పరిష్కారమేమిటి? అసలు ఇది నిజమైన అధ్యాత్మికతా? లేక అసలైన మానవత్వమా? మానవత్వం లేని ఆధ్యాత్మికత వుంటుందా? ఆధ్యాత్మికతగాని మానవత్వం సరియైనదా?

ఈ ప్రశ్నలకు సమాధానంగా పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పారు: "పరిపూర్ణ మానవత్వమే ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత వేరనీ, లౌకికత వేరనీ అనుకుంటారు. కానీ యీ రెండూ వేరు గాదు. ఇటు ధర్మం ప్రకారం ఖచ్చితంగా జీవిస్తే, అదే ఆధ్యాత్మికతకు దారి తీస్తుంది. అటు ఆధ్యాత్మికతతో జీవిస్తే ధర్మం ఆచరించక తప్పదు. ఉదాహరణకు ఒకడు లౌకిక జీవితాన్ని పరిత్యజించి ఆధ్యాత్మికత కోసమే సన్యసించినప్పటికీ అతడు సన్యాసధర్మాన్ని సక్రమంగా ఆచరిస్తేగానీ అతడు కోరిన ఆధ్యాత్మికత లభించదు. కాబట్టి ఈ రెండింటినీ సక్రమంగా ఆచరిస్తూనే వీటికతీతమైన దానిని పొందవచ్చు. ఈ రెండింటిలో ఏది లోపించినా కుంటినడక తప్పదు. వాడు పరిపూర్ణ మానవుడు ఏనాటికీ కాలేడు".

పూజ్యశ్రీ మాస్టరుగారు జనన మరణాల తత్త్వం గురించి, సృష్టి తత్త్వం గురించి, ఆధ్యాత్మిక తత్త్వం గురించి తీవ్రంగా ఆలోచించి తెలుసుకున్నారు. శ్రీ శిరిడీ సాయినాథుని అనుగ్రహంతో ఆయన ఆధ్యాత్మికానుభూతి పొందారు. అయినప్పటికీ ఆయన లౌకిక విషయాల పట్ల బాధ్యతను విస్మరించలేదు. మామూలు వ్యక్తులకంటే ఎంతో బాగా లౌకిక వ్యవహారాలను నిర్వర్తించేవారు. చిన్నప్పటినుంచి ఆయన ధైర్యసాహసాలకు పెట్టిన పేరు. ఎక్కడ ఎవరు అన్యాయంగా ప్రవర్తించినా సహించక వారితో న్యాయపోరాటం జరిపేవారు. తమవారిపట్ల, బంధువులపట్ల మాత్రమేగాక ఆయన అందరిపట్లఎంతో ప్రేమగా వుండేవారు. ఎవరికి ఎటువంటి సహాయం కావలసి వచ్చినా తమ శాయశక్తులా సహాయం చేసేవారు. తనవలన సహాయం పొంది తరువాత తమను ద్వేషించిన వారిని గూడ ఆయన నిందించక తండ్రివలె వారు బాగుపడాలని పాటుపడేవారు. చివరకు తమతో ఎంతో దుష్టంగా ప్రవర్తించినవారిపట్ల గూడ 'వారేమి చేస్తున్నారో వారికి తెలియదు. తండ్రీ! వారిని క్షమించు' అన్న ఏసుక్రీస్తు వలె వారి పట్ల జాలిపడేవారు. తమ తప్పు తెలుసుకుని తిరిగి ఆశ్రయించినవారిని ఆయన క్షమించేవారు.

ఇక సమాజం బాగుపడాలని ఆయన శతవిధాలా ప్రయత్నించారు. లౌకిక కోరికలతో వచ్చేవారికి బాబాను ఆశ్రయిస్తే వారి కోరికలు తీరుతాయని పారాయణలు చెప్పడమే గాక, శాంతి సౌఖ్యాలతో వుండడానికి

***మిగతా 28వ పేజీలో***

# సిద్ధయ్య

శ్రీమతి శ్రీదేవి

మహో మహిమాన్వితమైన, పరమ పవిత్రమైన భారతావని ఎందరెందరో మహాత్ములకు, అవతార పురుషులకు జన్మభూమి. మానవ జీవిత ప్రాభవాన్ని యినుమడింపజేస్తూ, అజ్ఞానపు అంధకారం నుండి ఆత్మజ్ఞాన మార్గానికి దారి చూపుతూ చేయూతనిచ్చి నడిపించే మహాత్ములు అవతరించి ఎందరినో తరింపజేసిన పుణ్యభూమి.

ఇంతటి మహోన్నతమైన భూమిలో జన్మించాడు 'గురుభక్తి' కి ప్రతిరూపమైన సిద్ధయ్య.

ఆంధ్రదేశంలోని కడప జిల్లాలోని చిన్నగ్రామం 'ముడుమాల'. ఆ గ్రామంలో ఆదంబీ, షేక్ పీర్ సాహెబ్ అనే ముస్లిం దంపతులు ఉండేవారు. ఆ దంపతులకు ఎంత కాలానికీ సంతానం కలుగలేదు. ఆ యిల్లాలు ఎందరో ఫకీర్లను సేవించింది. ఎన్నో దర్గాలను దర్శించింది. మత భేదాలెంచక ఎందరో హైందవ దేవీ దేవతలను, సాధు సత్పురుషులను సేవించింది. గుడుల చుట్టూ ప్రదక్షిణలు మ్రొక్కులు! ఒకటేమిటి? బిడ్డల కోసం ఆమె చేయనిది లేదు. ఎవరేమి చెపితే అదల్లా చేసింది. కానీ, ఎన్నాళ్ళకూ ఆమె కోరిక ఫలించలేదు.

కొన్ని సంవత్సరాల తర్వాత ఒకనాటి ఉదయం "భవతీ భిక్షాందేహి!" అన్న కేక విని వాకిట్లోకి వచ్చిన ఆదంబీకు భిక్షాపాత్రతో ఒక సాధువు దర్శనమిచ్చాడు. దైవభక్తుడైన అతనిని ఆ వూరి వారు "సిద్ధయోగి" అని చెప్పుకొంటూ వుంటారు. ఆయనను చూచిన బేగం పరుగున వచ్చి, ఆయనకు భక్తితో భిక్ష సమర్పించి, ఆయన పాదాలకు నమస్కరించి, చేతులు జోడించి నిలుచుంది.

'ఏ పుట్టలో ఏ పాముందో! ఈనాడు నాకు యీ స్వామి దర్శనమైంది. వీరి దయతోనైనా నా కోరిక తీరుతుందేమో!' ఆమె గుండెల్లో గూడు కట్టుకొని వున్న బాధ కళ్ళల్లో నుండి కన్నీళ్ళుగా వర్షించింది. సాధువు ఆమె వంక జాలిగా, ప్రేమగా చూశాడు.

"తల్లీ!" అని పలుకరించాడు.

ఆ కంఠంలో ధ్వనించిన ఆప్యాయతకు కరిగిపోయిందామె.

"స్వామీ!" అంది కన్నీళ్ళతో.

"తల్లీ! ఎందుకేడుస్తున్నావ్? ఏమికష్టమొచ్చిందమ్మా?" అన్నాడు.

"స్వామీ! తమకు తెలియని కష్టమా? తెలిసీ అడుగుతున్నారా?" దీనంగా అన్నది ఆదంబీ.

సాధువు నవ్వాడు.

"నీకు సకల సద్గుణ సంపన్నుడైన బిడ్డ జన్మిస్తాడు. ఏడవకు తల్లీ!"

"నిజంగానా స్వామీ! నాకంత అదృష్టమా?" అంది బేగం.

"అవును తల్లీ! ఇది సత్యం. నీ కోరిక ఫలిస్తుంది. శుభం" అంటూ రెండు చేతులెత్తి దీవించి వెళ్ళిపోయాడా సాధువు.

పులకరించిపోయింది ఆదంబీ. చిత్రంగా ఆ క్షణమే ఆమె బాధ మటుమాయమైంది. త్వరలోనే సిద్ధయోగి దీవెన ఫలించింది. ఒక శుభముహూర్తాన ఆదంబీకి మగబిడ్డ జన్మించాడు. సాధువు దీవెన ఫలమే అనుకుంది. కృతజ్ఞతతో ఆ బిడ్డకు అతని పేరే పెట్టుకుంది, 'సిద్ధయ్య' అని!

లేక లేక పుట్టిన ఆ పిల్లవాడిని అల్లారు ముద్దుగా పెంచుకోసాగారా దంపతులు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు చిన్న వయసు నుండే సిద్ధయ్య సద్గుణాలు వ్యక్తం కానారంభించాయి. పెద్దల పట్ల వినయవిధేయతలు, సాధు సత్పురుషుల పట్ల గౌరవం,

అపార భూతదయ, దైవచింతన! ఊరివారందరూ సిద్ధయ్యను ఎంతగానో ప్రేమించేవారు. అందరి హృదయాలలో అతడు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. అలనాటి సిద్ధయోగి దీవెన ఫలించకుండా వుంటుందా? అతడు నిజంగా సద్గుణ సంపన్నుడే!

---

అప్పుడప్పుడే మసక చీకట్లు వీడి ఆకాశం తెల్లని వెలుగును పరచుకొంటున్నది. ఆ లేత వెలుగులో దారి వెతుక్కుంటూ వడివడిగా అడుగులు వేసుకొంటూ నడుస్తున్నాడు యువకుడైన సిద్ధయ్య. ఆ రాత్రి తనకు స్వప్నదర్శనమిచ్చి, తన చెంతకు రమ్మని పిలిచిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి రూపాన్ని స్మరిస్తూ, ఆయన నామాన్ని మననం చేసుకొంటూ ముందుకు సాగుతున్నాడు. ఎప్పుడెప్పుడు స్వామిని చూస్తానా అన్న తపన, ఆతృతతో వడివడిగా నడిచి, నడిచి చివరకు ఆ స్వామివారి నివాస స్థలమైన పుణ్యభూమి 'కందిమల్లయపల్లె' చేరుకున్నాడు. పరమ పవిత్రమైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆశ్రమ ప్రాంగణంలోకి అడుగుపెట్టాడు.

"ఎవరు నువ్వు? ఇక్కడి కెందుకొచ్చావ్?" అంటూ అతనిని ఆజానుబాహువులయిన యిద్దరు వ్యక్తులు అడ్డగించారు. వారు గురుదేవుల పుత్రులు.

"నా పేరు సిద్ధయ్య. స్వామివారి దర్శనార్థం వచ్చాను. గురుదేవులు ఎక్కడ? దయచేసి చెపుతారా?"

"గురుదేవులా? ఎవరు నీకు గురువు?" గద్దించారావ్యక్తులు.

"శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారు. వారి ఆదేశానుసారమే వచ్చాను. రాత్రి వారు స్వప్న దర్శనమిచ్చి పిలిచారు. దయచేసి వారివద్దకు నన్ను వెళ్ళనివ్వండి" అంటూ చేతులు జోడించి ప్రార్థించాడు.

వారి కోపం కట్టలు తెంచుకుంది.

"ఎంత సాహసం? ఎంత పొగరు? ఒక ముసల్మానువై వుండి హైందవ గురువరేణ్యులయిన మా తండ్రిగారి వద్దకు రావటానికి నీకెంత ధైర్యం? ముందు ఫో! యిక్కడి నుండి"

"బాబూ! మీరెవరో నాకు తెలియదు. నా మనస్సు వారి దర్శనం కోసం తపిస్తున్నది. వారిని చూడకుండా వుండలేను. కరుణించి నాకు స్వామి దర్శనం యిప్పించండి" అంటూ కన్నీళ్ళతో ప్రార్థించాడు సిద్ధయ్య.

"ఎంత మాత్రం కుదరదు. మర్యాదగా యిక్కడి నుండి పోతావా? మెడపట్టి గెంటేయమంటావా?" అంటూ మీదికొచ్చారు. ఇంతలో —

"సిద్ధా! లోపలికి రా నాయనా!" సిద్ధయ్య చెవులలో అమృతం పోస్తున్నట్లున్న చల్లని పిలుపు. "సిద్ధా! భయం లేదు. లోపలికి రా నాయనా!" మరల విన్పించిందా పిలుపు.

తెల్లబోయి నిలుచున్నారా వ్యక్తులు.

ఒక ముస్లిం యువకుడిని తన తండ్రిగారు యింత ఆప్యాయంగా లోనికి ఆహ్వానించటమా?" అనుకొంటూ నిశ్చేష్టులై నిలబడిపోయారు వారు.

సిద్ధుడు పరుగున వెళ్ళి స్వామి పాదాలపై పడ్డాడు.

---

"గురుదేవా! గురుదేవా! స్వామీ! నా తండ్రీ! ఇన్నాళ్ళకు దర్శనమిచ్చారా!" దీర్ఘకాల ఎడబాటు తర్వాత తల్లిని చేరిన బిడ్డలాగా తన పాదాలపైబడి విలపిస్తున్న సిద్ధుని లేవనెత్తి ఆశీర్వదించారు స్వామి.

సిద్ధయ్య మనసు వశం తప్పింది. భక్తి పారవశ్యంతో స్తుతులు అతని నోటి వెంట వెలువడ్డాయి.

***ఎన్నెన్ని జన్మల అనుబంధమో యిది.***
***నిను చూసి ఉప్పొంగితిని కన్న తండ్రీ!***

***కులములు వేరుగా, మతములు వేరుగా***
***లోకులు కాకులై అంతరమ్ములు రేప***
***అంతరంగములోన అంతరమ్ములు లేక***
***ఆత్మ బంధుడవై ఆదరించితివయ్యా!***

***నీకు నేనేమౌదునో నేనెరుగనోయి!***
***నీ ఒక్కపిలుపె నను నిలువనీయకపోయె!***
***శరణంటు పడి వస్తి! నీ చరణముల నమ్మి***
***ఆత్మార్పణము చేసి జన్మధన్యత నొంద!***
***నీవాడనే నేను నిను వీడిపోలేను***
***నిన్ను ఎడబాసి నే జీవించగా లేను***
***లోకాల నేలేటి లోకేశ్వరా!***
***నా పాపాలు దహియించి పరమార్థమొసగుమా!***

***పాహిమాం పాహిమాం***
***వీరబ్రహ్మేంద్ర గురు!***
***రక్షమాం రక్షమాం***
***వీరబ్రహ్మేంద్ర గురు!***

సిద్ధయ్య కన్నీళ్ళతో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి పాదాలు అభిషిక్తమైనాయి.

**- సశేషం**

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## ఎనిమిదవ ప్రసంగము

అహం : (తనలో తానే ఇలా అనుకున్నాడు) చాలా దాంభికుడిలా వున్నాడే. ఈ ఆసనం మీద కూర్చుంటాను.

ఇలా భావించి ప్రక్కనే ఉన్న ఉన్నతాసనము మీద కూర్చోబోయాడు. అప్పుడు శిష్యుడు వారిస్తూ ఇలా అన్నాడు.

"అరే, అదేమిటి? ఇది పూజ్యపాదులైన గురుశ్రీ గారి ఆసనము. దాని మీద కూర్చునే అధికారం ఎవరికీ లేదు."

అహం : ఓరి పాపీ! దక్షిణదేశంలో కూడా ప్రసిద్ధి చెందిన పవిత్రమైన వంశంలో జన్మించిన నావంటి వాడికి కూడా ఈ ఆసనం మీద కూర్చునే అధికారం లేదా? విను. నేను సోమయాజి కుమార్తెను వివాహం చేసుకున్నాను. కాబట్టి నేను నా తండ్రి కంటే గొప్పవాడిని. అంతేకాదు నా బావమరిది మిత్రుడి కుమార్తె మీద నిందమోపబడింది. కాబట్టి వరుసవారీన నా భార్య మీద కూడా నింద మోపబడుతుందేమోనని భావించి ఆమెనే వదిలేశాను. అంత పవిత్రుడిని.

దంభు : నిజమే కావచ్చు. నేను స్వర్గంలో బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళాను. అక్కడ మహర్షులందరూ నన్ను చూసి తమ ఆసనాలను విడిచి చేతులు జోడించి లేచి నిలబడ్డారు. అక్కడ నాకు తగిన ఆసనము లేనందువలన బ్రహ్మగారు తన ఒడిని గోమయంతో (ఆవుపేడతో) శుద్ధి చేయించి ఎంతో మర్యాదతో నన్ను దానిమీద కూర్చోబెట్టారు. ఇలా దేవతలే నన్ను గొప్ప పవిత్రమూర్తిగా భావించి గౌరవిస్తుంటారు. ఇక మిగిలినవారి సంగతి ఏమి చెప్పను?

అహం : ఓరీ' ఋషుల గురించి నాకా చెబుతున్నావు? ఋషుల పుట్టుకలు విను. వ్యాసుడు పల్లెటూరి అమ్మాయి కొడుకు. అగస్త్యుడు మట్టికుండ కొడుకు. లేడికి ఋష్యశృంగుడు పుట్టాడు. ఇలానే ఋషులందరి పుట్టుక నిందించదగినదే. వారిని నా

ఎదుటనా పొగుడుతున్నావు?

దంభు : [ఓహో! మా తాత అహంకారుడే ఇతడు అని తెలుసుకొని సంతోషంతో ఇలా అన్నాడు.] నేను లోభుడి (పిసినారి) కుమారుడిని. నా నమస్కారం స్వీకరించండి తాతగారూ!

అహం : దీర్ఘాయుష్మాన్ భవ. నేను నిన్ను గుర్తుపట్టలేదు. నీ కొడుకు అసత్యుడు ఎలా వున్నాడు?

దంభు : సుఖంగా వున్నాడు. వాడు లేనిదే నాకు క్షణమైనా గడవదు.

అహం : నీ తల్లిదండ్రులైన తృష్ణ, లోభులు సుఖంగా వున్నారా?

దంభు : వారు లేనిదే నాకేమీ తోచదు. వారు సంతోషంగా కాలం గడుపుతున్నారు.

పై సంభాషణ తాత్పర్యము ఏమిటంటే అసత్యము, తృష్ణ, లోభము మొ॥న అసురగుణాలు దంభంతో అవినాభావ సంబంధం కలిగి వుంటాయి.

ఈ తీర్థాలలోను, ఆశ్రమాది ధర్మస్థలాలలోనూ, కనిపించేవారిలో చాలామంది దాంభికులు. ప్రజల నుండి ధనాన్ని ఎలా కొల్లగొడదామా అని ఆలోచించేవారే. వారిని గురించి ప్రబోధచంద్రోదయంలో ఇలా వున్నది –

శ్లో॥ గంగాతీర తరంగ శీతల శిలా విన్యస్త భాస్వద్బృసీ
సంవిష్టాః కుశముష్టిమండిత మహాదండాః కరణ్డోజ్జ్వలాః।
పర్యాయ గ్రథితాక్షసూత్ర వలయ ప్రత్యేక బీజగ్రహ
వ్యగ్రాగ్రాంగులయో హరన్తి ధనినాం విత్తాన్యహో దాంభికాః॥

భావం : గంగాతీరంలో, నీటి అలల వలన చల్లబడిన శిలల మీద పరచబడిన దర్భాసనాల మీద కూర్చుని దర్భముడులతో అలంకరింపబడిన దండాలతోనూ, ప్రకాశవంతములైన కమండలాలతోనూ రుద్రాక్షమాలలోని పూసలను వేళ్ళతో తిప్పుతున్న దాంభికులు ధనికుల ధనాన్ని దొంగిలిస్తున్నారు. ఎంత బాధాకరము!

ఇలానే మరికొంతమంది స్థిరజీవితాన్ని పొంది – అంటే – మఠము మొ॥నవాటిని సంపాదించి చాతుర్మాస్యకాలంలో ఒకే చోట ఉంటూ మిగిలిన రోజులలో దేశవిదేశాలలో సంచరించి ధనాన్ని ఆర్జిస్తారు.

శ్లో॥ ధనాహారార్జనే యుక్తాః
దాంభికా వేషధారిణః।
భ్రమంతి జ్ఞానివల్లోకే
భ్రామయన్తి జనానపి ॥

భావం : ధనాన్ని, ఆహారపదార్థాలను సంపాదింపదలచిన కపటవేషధారులైన దాంభికులు జ్ఞానులలాగా ప్రపంచంలో సంచరించి ఇతరులను మోసం చేస్తారు.

వీరు నలుగురైదుగురు ఒక్కొక్క గుంపుగా చేరి సిద్ధులు, సాధువులై శిష్యసంచారాలు చేస్తారు. ప్రజలకు నమ్మకము కలిగేందుకు వీరు ఇలా చెప్తారు – "సద్గురువులు సిద్ధులు. పూర్ణత్వం పొందారు. శ్రీవారి చమత్కారాలు అనంతాలు. మానవుల కోరికలన్నీ నెరవేరుతాయి. ధనము కావలిసినవారికి ధనం వస్తుంది. సంతానము కావలసినవారికి సంతానం కలుగుతుంది. ఈ రోజులలో గురువు అనిపించుకోవడానికి తగిన ఇటువంటి సిద్ధులు మరొకరు లేరు. ఎంతో పుణ్యాత్ములే ఇటువంటి సిద్ధ సంపన్నులు, సమర్థులైన గురువుగారిని పొందగలరు."

ఇది విని ఎవరైనా భిక్షకు ఆహ్వానించినట్లైతే శిష్యకోటి ఇలా అంటారు – "భోజనానికి పలురకాలైన పిండివంటలు ఫలానా విధంగా చేయాలి. గురువుగారికి ఇన్ని రూపాయలు కానుకగా ఇవ్వాలి. ఇలా గురువుగారి పూజ చేయించినట్లైతే ప్రజలకు గురుమంత్ర స్వీకారం లభిస్తుంది." ఈ విధంగా వారు ప్రజలను మోసగిస్తారు. 'భ్రామయన్తి జనానపి' – జననమరణాత్మకమైన ప్రపంచంలో వారిని తిప్పుతారు. ఈ విషయంలో అంధగోలాంగూల న్యాయమును దృష్టాంతంగా గ్రహించవచ్చు –

ఒక రాజకుమారుడు ఒంటరిగా తిరుగుతూ నగరము బయటకు వెళ్ళాడు. అతనిని కొంతమంది దొంగలు చూశారు. వారు ఇతనిని అడవిలోకి తీసుకుని వెళ్ళి ఆభరణాలన్నీ తీసుకున్నారు. రాజకుమారుని అలానే వదిలితే ఎప్పుడో ఒకప్పుడు తమను పట్టించి వేస్తాడని భావించి వారు అతని రెండు కళ్ళనూ పీకేశారు. అప్పుడు ఆ రాజకుమారుడు ఇలా అన్నాడు – "మీరు నా రెండు కళ్ళనూ పోగొట్టారు. ఇక నేను రాజధానికి వెళ్ళలేను. దయతో నన్ను రాజధానికి చేరిస్తే ఎంతో ఉపకారం చేసినవారౌతారు". ఇంతలో ఆ దొంగలకు ఒక ఆబోతు మేస్తూ కనిపించింది. వారు ఆ ఆబోతును పట్టుకొని తీసుకొనివచ్చి దాని తోకను రాజకుమారునికి అందించి ఇలా అన్నారు – "దీనికి విడవవద్దు. ఇది నిన్ను

రాజధానికి తీసుకుని వెళుతుంది." రాకుమారుడు దొంగలు చెప్పినట్లు ఆబోతుతోక పట్టుకున్నాడు. ఆబోతు ఉరకలు వేస్తూ పరుగెత్తింది. రాజకుమారుడి శరీరం చాలా గాయపడింది. అయినా అతడు ఆ ఆబోతు తోకను విడిచిపెట్టలేదు. అతని శరీరం రక్తసిక్తమైంది. చివరకు ఒక నూతిలో పడి ఆ రాజకుమారుడు మరణించాడు.

కపటవేషధారులైన దాంభికులు ఏదో ఒక మాయోపాయంతో ఆ దొంగలలాగా ప్రజల ధనము, మనస్సు, శరీరము హరిస్తారు. పైగా, వారికి శాస్త్రజ్ఞానము కలుగనీయరు. దొంగలు రాజకుమారునికి ఆబోతు తోకను ఇచ్చినట్లు తాము గురుమంత్రాన్ని ప్రసాదిస్తారు. ఆ రాజకుమారుడు నూతిలో పడి ప్రాణాలు కోల్పోయినట్లే ప్రజలు పక్కదారిపట్టి జననమరణాత్మకమైన ప్రపంచంలో తిరుగుతూ వుంటారు.

తుకారాము తన అభంగలో ఇలా చెప్పాడు –

"కొందరు గురువులు ప్రజలను శిష్యులుగా చేయడానికి, లాభసాటి బేరముపై పనిచేయడానికి మధ్యవర్తులను ఉంచుకుంటారు. వారి ద్వారా శిష్యులను ఆకర్షిస్తారు. వారికి గురుమంత్రము, గురూపదేశము చేస్తారు. ఇలా కడుపునింపుకునే వారి ద్వారా భగవంతుడు ఎలా లభిస్తాడు? ఇటువంటి గురువులు అజ్ఞానులైన మానవులను తమ వాక్చాతుర్యంతో బంధించి 'వార్షికాలను' ఏర్పాటు చేసుకుంటారు. వారిచేత వార్షికాలను (సంవత్సర చందా) ఇవ్వడాన్ని అంగీకరింపజేస్తారు. వీరు తమ మాటలను అనుసరించి ప్రవర్తించరు. అటువంటి వీరి ఆచరణ తమోగుణ ప్రధానమైనది.

కొంతమంది సన్యాసము పుచ్చుకుని కాషాయాంబరాలను ధరిస్తారు. కాని, మనస్సులో నాటుకుని వున్న విషయవాసనలను నిర్మూలించుకోరు. వారికి సాధారణమైన ఆహారము ఇష్టంగా వుండదు. మధురమైన పదార్థాలలో కూడిన భోజనం మాత్రమే రుచిస్తుంది. ఎవరు గౌరవిస్తారా, ఎవరు పూజిస్తారా అని ఎదురుచూస్తారు. వీరు పైకి మాత్రము నారాయణ నామస్మరణ చేస్తారు. ఇటువంటి ఆచరణ కలవారికి జనార్దనుడు ఎలా కనిపిస్తాడు?

కొందరు స్వాములు పొడవాటి జడలు ధరించి, గోచీ బిగించి తమ సాధుత్వాన్ని గర్వంగా ప్రచారం చేసుకుంటూ మాట్లాడుతారు. శరీరము విభూతితో నిండి వుంటుంది. కాని, పిండి వంటలు వండి ఎవరు భోజనానికి పిలుస్తారా అని ఎదురుచూస్తూ వుంటారు. వారికి స్వధర్మము అనేది వుండదు. కానీ వారి మాటల గారడీలో పడి ప్రజలు చెడిపోతారు."

స్వా॥ని॥ :- ఈ సందర్భంలో దాంభిక గురువును గురించి ఒక దృష్టాంతం వినండి – శ్రీ రామచంద్రుడు అయోధ్యను వదిలినపుడు అయోధ్య వాసులందరినీ పుష్పక విమానంలో కూర్చోబెట్టి తన నివాసానికి చేరుస్తూ వున్నాడు. ఆ సమయంలో ఒక పుచ్చుకుక్క శత్రుఘ్నునితో ఇలా అన్నది – "రామచంద్రులవారితో చెప్పి నన్ను కూడా ఈ విమానంలో పంపండి." శత్రుఘ్నుడు రామచంద్రుని దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు "ఒక పుచ్చుకుక్క కూడా వస్తానని ప్రార్థిస్తున్నది". రామచంద్ర భగవానుడు ఇలా అన్నాడు – "ఆ దుఃఖముతోనున్న దానిని మొట్టమొదటే తీసుకెళ్ళాలి." ఇలా అని ఆ కుక్కను ఇలా ప్రశ్నించాడు. "నీకు ఈ దుస్థితి ఎలా కలిగింది?"

ఆ కుక్కకు మాట్లాడే శక్తి వున్నది. కాబట్టి అది చెప్పింది – "భగవంతుడా! నేను పూర్వజన్మలో సన్యాసిని. అనేక మందిని శిష్యులుగా చేసికొని వారికి అధర్మాన్ని ధర్మంగా బోధించాను. శాస్త్రంలో అపరిగ్రహము (ఎవరి నుంచీ ఏదీ ఉచితంగా తీసుకోకపోవడం) అనే నియమం వున్నది. దానికి నేనిలా అర్థం చెప్పేవాడిని –

'అహం మమేత్యయం బన్ధో, నాహం మమేతి ముక్తతా।' (అష్టావక్ర వచనము). 'అహం, మమ' – 'నేను' అనే బుద్ధిని విడిచిపెట్టి ఎనిమిది రకాలైన భోగాలనూ అనుభవించినా తప్పులేదు. మమకారం లేనివాడినై ఇల్లు, భూమి, ధనము మొ॥న వాటిని తీసుకున్నప్పటికీ దోషం లేదు." అంతేకాదు నేను ఈ విధంగా కూడా చెప్పేవాడిని – "దేవుడు మాయను సృష్టించాడు. కాబట్టి మాయ నుంచి పుట్టిన పదార్థాలను తిరస్కరించడమంటే దేవుని తిరస్కరించడమే. దేవుడు సృష్టించిన భోగాలను అనుభవించడంలో తప్పేలేదు!" ఇలా ప్రజలకు తల్లక్రిందులుగా నచ్చచెప్పి, నా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించి, ప్రజలు కూడా అలా ప్రవర్తించేటట్లు చేశాను. కాబట్టే నాకు కుక్క జన్మ వచ్చింది. నా శిష్యులు పురుగు జన్మను పొంది నా శరీరాన్ని తినేస్తున్నారు. ఇది నాకు, నా శిష్యులకూ కలిగిన దుర్గతి."

**- సశేషం**

# మాతృదేవి స్మృతులు

*శ్రీ అడిదం శ్రీకాంత్, నాగోలు*

నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనభాగ్యం నా 11వ ఏట తణుకు లో కలిగింది. మా అమ్మగారి ప్రోద్బలం వల్ల మాస్టరుగారిని రెగ్యులర్ గా (సంవత్సరానికి 1 లేదా 2 సార్లు) దర్శనం చేసుకునే వాడిని. నా పుట్టినరోజుకి పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం ఒక నియమంగా ఏర్పడింది. చైతన్య స్వామి పరిచయమూ, సాంగత్యము వల్ల మాస్టరుగారి పట్ల పూజ్యశ్రీ అమ్మగారి పట్ల కొంత అవగాహన కలిగింది.

వేదవతితో వివాహం సహజంగానే నా జీవితానికి పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సు. ఆ ఆశీస్సు భౌతికంగా, ప్రత్యక్షంగా పూజ్యశ్రీ అమ్మగారి సాన్నిధ్యరూపంలో లభించడం నా ఆధ్యాత్మిక అవగాహనకి మూలం అయ్యింది. నా వివాహ సమయానికి నేను 'శ్రీ సాయి లీలామృతం' పారాయణ, 'శ్రీ గురు చరిత్ర' పారాయణ చేస్తూ ఉండటమే కాక 'ఏదినిజం?' వంటి ఇతర గ్రంథాలు కూడా అధ్యయనం చేస్తూ వుండేవాడిని. ఆ పారాయణ, అధ్యయనాల ఫలితంగా శ్రీ సాయినాథుని పట్ల భక్తి, ఆధ్యాత్మికత పట్ల కొంత అవగాహన కలిగిన మాట వాస్తవం. అప్పటికి నా చుట్టుపక్కల వున్నవారి కంటే నా అవగాహన కొన్నిరెట్లు మెరుగుగా ఉండేది, మన సత్సంగ సభ్యులందరికీ లాగానే. అయితే పూజ్యశ్రీ అమ్మగారి ప్రత్యక్ష సాన్నిధ్యం వల్ల, ఆ సన్నిధిలో జరిగిన సత్సంగాల వల్ల, నాకు శ్రీ సాయినాథుని పట్ల ఉన్న భక్తి, ఆధ్యాత్మికత పట్ల ఉన్న అవగాహనల యొక్క స్వరూప స్వభావాలు సమూలంగా మారిపోయాయి. "పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమి చెప్పారో నాకు తెలుసు. వారు ఏమి చెప్పారో నాకు అర్థం అయ్యింది" అన్న ముసుగు వేసుకున్న మూర్ఖత్వం సడలి, పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన, ఆచరించిన ఆధ్యాత్మిక జీవితం ఎంత గంభీరమైనదో, ఎంత కష్టతరమైనదో, ఎంత అవసరమైనదో అర్థమవ్వసాగింది. సామాన్యంగా మన సమాజంలో, (మన సత్సంగాలలో కూడా) ఆచరణ యోగ్యం అని తలచబడే ఆధ్యాత్మిక జీవితానికి – పూజ్యశ్రీ మాస్టరుగారిచే విధించబడి పూజ్యశ్రీ అమ్మగారిచే ఆచరించబడిన – అసలు సిసలు అయిన – ఋషిప్రోక్తం అయిన – ఆధ్యాత్మికతకు ఉన్న వ్యత్యాసం తేటతెల్లం అవ్వసాగింది. మాస్టరుగారు మనకి ప్రసాదించిన గురు సాంప్రదాయంలో అమ్మగారి పాత్ర అర్థం అవ్వసాగింది. లక్ష్యం ఏర్పరుచుకుని, ఆ లక్ష్యాన్ని తన గురువు (మాస్టరుగారు) చెప్పిన విధంగా సాధించుకున్న ఉత్తమ జీవితం అమ్మగారిది. అట్టి ఈ జీవితాన్ని పరిశీలిస్తే తప్ప, అర్థం చేసుకుంటే తప్ప "ఉత్తమ జీవిత విధానం" అనే విషయంలో 'ఉత్తమం', 'జీవితం', 'విధానం' అనే మాటల పట్ల మనకి స్పష్టత కలగదు అన్నది విదితమయ్యింది.

అయితే అవగాహనారూపాలైన ఇట్టి భావాల కంటే అమ్మగారి సాన్నిధ్యంలో వారి ఆప్యాయత మాత్రమే అనుభవం అవడం ఎంతో విచిత్రం అనిపిస్తుంది. అమ్మగారి సన్నిధి అని మనం పిలుచుకునే వాతావరణం ఎంతో సామాన్యంగా మనకి పరిచయమైన ఇంటి వాతావరణం లాగానే ఉండేది.

అయితే మాస్టరుగారి పట్ల, బాబా పట్ల భక్తిశ్రద్ధలు, ప్రయాస, ప్రయత్నం లేకుండా వ్యక్తమవుతూ ఉండేవి.

పూజ్యశ్రీ అమ్మగారు చిక్కడపల్లిలో ఉన్నప్పుడు ఒకసారి కొంతమందిమి అమ్మగారి గదిలో ఉన్నాము. సత్సంగం జరుగుతోంది. అకస్మాత్తుగా అమ్మగారి మొహంలో ఒకానొక మార్పు కానవచ్చింది. 'ఆమె ఆ గదిలో లేరు, మన మధ్యలో లేరు' అనిపించింది. జరుగుతున్న మాటలు ఆగిపోయాయి. వాతావరణం నిశ్శబ్దమూ, గంభీరమూ అయిపోయింది. పూజ్యశ్రీ అమ్మగారి ముఖవర్చస్సు చూస్తే అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తున్నట్టుగా అనిపించింది. కొంత సమయం తర్వాత అమ్మగారు మామూలుగా అయ్యారు. కానీ గదిలో వాతావరణం ఇంకా గంభీరంగానే ఉంది. ఏదో అయ్యిందని తెలుస్తోంది. ఏమి అయ్యిందో తెలియదు. 'ఏమయ్యిందమ్మా?' అని ఎవరో అడిగిన ప్రశ్నకు 'బాబా దర్శనం అయ్యింది' అని అలౌకికమైన శాంతితో అమ్మగారు చెప్పిన దృశ్యం ఎప్పటికీ నేను మరువలేనిది. ఉన్నట్టుండి కళ్ళముందు దృశ్యం మారి ద్వారకామాయిలో బాబా కనిపించారని పూజ్యశ్రీ అమ్మగారు వివరించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్టు ఏ తృప్తి, శాంతి కొరవడి మనమందరం అనేక ప్రయత్నాలు చేస్తూ విఫలం అవుతూ ఉన్నామో అట్టి తృప్తి, శాంతి అనే స్థితిలో ఉన్న అప్పటి అమ్మగారిని చూసినప్పుడు లేదా ఆ సన్నివేశం గుర్తుకి తెచ్చుకున్నప్పుడు మాత్రమే, అట్టి క్షణాలలో మాత్రమే,



ఆధ్యాత్మికత మనకు ప్రత్యక్ష నిజము. జాగ్రత్తగా ఆలోచించుకుంటే ఆధ్యాత్మిక జీవితంపట్ల మన అవగాహన పెరగడానికి, ప్రేరణ, ఉత్సాహం పొందడానికి ఆ సన్నివేశం ఉపయోగపడినంతగా మరే ప్రయత్నం ఉపయోగపడదు. అప్రయత్నంగా, అయాచితంగా అలాంటి ప్రేరణ, ఉత్సాహం కలిగించడమే అమ్మగారి సన్నిధి. ఆ సన్నిధి సాక్షాత్తు బాబా, మాస్టరుగార్ల సన్నిధి అనడానికి మన సత్సంగ సభ్యుల అనుభవాలు ఎన్నో ఉన్నా, ఒకటి రెండు సందర్భాలలో పూజ్యశ్రీ అమ్మగారే మనపై దయతో చెప్పిన మాటలు మనకు అనుసరణీయం. "ఇక్కడ బాబా, మాస్టరుగారు వున్నారు" తాను ఉన్న చోటు చూపిస్తూ అన్న ఆ మాటలు మనపై ప్రేమతో అమ్మగారు చెప్పిన హితవాక్కు. ఆధ్యాత్మికతకి మూలమూ ఆధారమూ అయిన బాబా సన్నిధి, పరమహంస సన్నిధి, రమణుల సన్నిధి, పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధి వంటిదే పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధి అనడానికి మనకు అమ్మగారి మాటలే ఆధారం.

సామాన్యంగా పూజ్యశ్రీ అమ్మగారు సామాజికమైన, లౌకికమైన ఆచార వ్యవహారాలకి తగిన ప్రాముఖ్యం ఇచ్చేవారు. కుటుంబపరమైన సంబంధాలు, తన వద్ద ఉన్నవారికి సంబంధించిన ఆచార వ్యవహారాలను కాదనేవారు కాదు. మనకు తెలిసిన పద్ధతులు మామూలు ఇళ్లలో లాగానే అమలు అవుతూ ఉండేవి. సహజంగానే అత్యంత శ్రద్ధతో అమలు అయ్యేవి. ఎంతగా అంటే ఆ సన్నిధి సామాన్యమైన గృహిణి సన్నిధి అనిపించేంతగా. 'మనం మంచి అనుకునే ఆచార వ్యవహారాలను పూజ్యశ్రీ అమ్మగారు శ్రద్ధగా పాటిస్తారు' అని మనం పొరబడేటంతగా అమలు అయ్యేవి. అయితే కొన్ని సందర్భాలలో అమ్మగారు ఇట్టి లౌకికమైన ఆచార వ్యవహారాలను కాదని, వాటికి



వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకోవడం నేను చూసాను. ఎంతో కఠినంగా అనిపించేవి ఆ నిర్ణయాలు. అట్టి సందర్భాలలో పూజ్యశ్రీ అమ్మగారు - మనకు మంచి, న్యాయం, ఆచారం అనిపించే ఆచార వ్యవహారాలను - దృఢంగా, నిక్కచ్చిగా, ప్రశాంతంగా, నిర్భయంగా కాదని, వాటికి వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకోవడం చాలా ఆశ్చర్యం అనిపించేది. ఆ నిర్ణయాల పర్యవసానం లౌకికంగా పూజ్యశ్రీ అమ్మగారికి, వారి కుటుంబానికి, అమ్మగారి దగ్గర ఉన్నవారికి ఎంతో చేటు అని మనకి అనిపించే సందర్భాలు అవి. అనేక సందర్భాలు అలాంటివి చూసిన తర్వాత 'ఇక్కడ బాబా, మాస్టరుగారు ఉన్నారు' అన్నమాట అర్థం అయ్యింది. ఆ సన్నిధికి - ప్రపంచానికి ఉన్న సంబంధం, మనకి - ప్రపంచానికి ఉన్న సంబంధం వంటిది కాదని, అక్కడ మానవ సంబంధాల పరిరక్షణకి, ఇష్టాయిష్టాలకి మన జీవితాలలోలాగా పెద్దపీట వెయ్యబడదని; ధర్మము, దాని ఆచరణ మాత్రమే ఆ సన్నిధిలో జరుగుతుందని అర్థం అయ్యింది. సంపన్నత్వం అన్న మాట విన్నప్పుడల్లా నాకు పూజ్యశ్రీ అమ్మగారే గుర్తు వస్తారు.

నా వివాహం అయిన కొత్తల్లోనూ, ఆ తర్వాత కొన్ని సందర్భాలలోనూ నేను ఒక విషయం గమనించాను. పూజ్యశ్రీ అమ్మగారు ద్వారకని, వేదవతిని ప్రత్యేకంగానే చూసేవారు. ఉదాహరణకి అందరం సత్సంగానికి కూర్చున్నప్పుడు ఏదైనా పని కోసం ఎవరో ఒకరు లేవవలసి వచ్చినప్పుడు ద్వారక కానీ, వేదవతి కానీ లేవడానికి ప్రయత్నం చేస్తే వద్దనే వారు. "నువ్వెందుకు? వాళ్ళు చేస్తారు" అనేవారు. చాలా గట్టిగానే వారించేవారు. ఆ వారించడం ఒక తల్లి తన పిల్లలు కష్టపడకూడదు అనే తలంపుతో చేసినట్టుగా ఉండకపోవడం మాత్రం స్పష్టం. ఎందుకంటే వాళ్ళు ఏమి చేస్తే బావుంటుంది? అనే విషయం ప్రస్తావనకి ఎప్పుడు వచ్చినా, అమ్మగారు వాళ్లకి నిర్దేశించిన పనులు ఎంతో కష్టతరమైనవి, ప్రయాసతో కూడుకున్నవి అయి ఉండేవి. అందుకని వాళ్ళని ప్రత్యేకంగా చూడటం వారి సౌఖ్యం కోసం కాదు అన్నది నిర్వివాదాంశం. మరి ఎందుకు ప్రత్యేకత అన్నది నాకు క్రమేపి విశదం అయ్యింది. ద్వారకని, వేదవతిని పూజ్యశ్రీ అమ్మగారు తమ గురువు గారి పుత్రుడు, పుత్రికగానే చూసేవారు. ఒక మహనీయుని సంతానంగానే చూసేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి అనంతరం పట్టుదలతో, ఓరిమితో, సంతోషంగా తన సంతానం అనే భావంతో కాక, తన గురువు యొక్క సంతానం అనే కర్తవ్యభావంతో, గురుసేవగా వారిని పెంచారు అన్నది నాకు స్పష్టమైనది, ఆశ్చర్యకరమైనది అయిన అంశం.

నిలయంలో వంటిల్లు సర్దిస్తున్నా, గదులు సర్దిస్తున్నా, తీర్థచరణ్, కైవల్యల పుట్టినరోజులు జరిపిస్తున్నా, నాగోలు భక్తులకు ప్రసాదం ఇప్పిస్తున్నా, ద్వారక, వేదవతుల సత్సంగాలు ఏర్పాటు చేస్తున్నా , ఏ పని చేస్తున్నా , ఆ పనిలో అమ్మగారి శ్రద్ధ పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల, ఆయన విధించిన జీవితవిధానం పట్ల పూజ్యశ్రీ అమ్మగారికి ఉన్న నిష్ఠ. ఎంతో సామాన్యంగా అనిపించే వ్యవహారశైలి వెనుక దాగున్న కర్తవ్య నిర్వహణ అనే గురుసేవ. "తాయి" అని ముద్దుగా పిలవబడ్డ ఒక శిష్యురాలి ధర్మాచరణ. ఇది గుర్తు ఉన్నంతసేపు మన జీవితాలు సార్థకం.

జై సాయి మాస్టర్ !

(గత సంచిక తరువాయి)

# ప్రేమ స్వరూపుడు

*శ్రీ కె. ఎస్.ప్రసాద్*

**(అతి చిన్న వయస్సులో మాస్టరుగారి దరిచేరి వారి ప్రేమను పొంది, వారి జీవితంలోని ప్రతి అంశాన్ని కుతూహలంతో క్షుణ్ణంగా పరిశీలించి వారి ఆచరణా పాటవానికి ప్రభావితుడై ఆధ్యాత్మిక బాటలో బాటసారియై తన లక్ష్యము వైపు పురోగమిస్తున్న వీరు ఉత్సాహంగా, విపులంగా మాస్టరుగారి జీవిత ఘట్టాలను మనకందిస్తూ సాయిమాస్టర్ సన్నిధికి తీసుకెళ్తున్నారు.)**

మాస్టరుగారి వద్దకు వచ్చే ఒకతనికి తాను గొప్ప సాధకుడినని, ఆ సంగతి మాస్టరుగారు గుర్తించటం లేదని, నలుగురికి తన సాధన గురించి గొప్పగా చెప్పటం లేదని ఎంతో బాధగా వుండేది. అతడొకసారి నా దగ్గర "బుద్ధుడు శిష్యులను పిలిచి, నీవేమి సాధన చేశావు? నీ అనుభవాలు ఏమిటి? నీవు తెలుసుకున్న సత్యాలేమిటి? అవి సంఘానికి ఎలా వుపయోగ పడతాయి? సంఘానికి నువ్వేమి చేస్తున్నావు?" అని అడిగేవారట. కాని మాస్టరుగారు ఏమీ అడగరేమిటి? అడిగితే కదా మనం చేసే సాధన ఏమిటో (అంటే ఎంతటిదో) అందరికీ తెలిసేది?" అని వాపోయాడు. మాస్టరుగారికి అతని భావాలు తెలియక పోతే గదా! సందర్భం చూసి వాత పెట్టడంలో అందవేసిన చెయ్యి వారిది. ఒకరోజు సత్సంగంలో బుద్ధుని బోధనలు ఇంగ్లీషులో చదివి తెలుగులో వివరిస్తున్నారు. అప్పుడు అతను కూడా వున్నాడు. మాస్టరుగారు మాటల సందర్భంలో , "సాధన చేయటమంటే, మలమూత్ర విసర్జనానంతరం అవయవాలను శుభ్రపరచుకోవటం లాంటిది. మనం శుభ్రపరచుకోకపోతే మనకే వాసనొచ్చేది. అవతలి వాడికి ఏమి నష్టం? వాడు మనల్ని తప్పుకుని దూరంగా పోతాడు. నేను శుద్ధపరచుకొంటున్నాను కనుక మీరంతా వచ్చి నా గొప్పతనాన్ని గుర్తించండి. నా దర్శనం చేసుకోండి అన్నట్టుంటుంది. నేను సాధన గొప్పగా చేస్తున్నాను, నన్ను మెచ్చుకోండి అనటం. మనం సాధన చేయటం మనలను మనం బాగుపరచుకోవటానికే ఇంకెవరికోసమో కాదు. అవతలివాడు గొప్పగా అనుకోవాలి అనుకున్నాడంటే వాడు చేసేది సరైన సాధనే కాదు" అన్నారు.

1975లో మెట్టులో పడుకుని వుంటే స్వప్నంలో ఏవోవో దృశ్యాలు వస్తున్నాయి. మనస్సులో నా కెందుకు ఈ స్వప్నం వచ్చింది. మాస్టరుగారికి నా ముఖమెలా చూపించాలి. వారు నన్ను ఈసడించుకుంటారేమో? నేను సాధనకు పనికిరానేమో ఈ జన్మకని, ఇంకా ఏవేవో తెలియని భయాలు వూహించుకుంటూ సాయంత్రం మాస్టారి వద్దకు 5 గంటలకు పోతుంటే

కాలేజీ క్యాంపస్ వద్దే మాస్టరుగారు ఎర్రటి చొక్కా తొడుక్కుని, ముఖం మంచి వర్చస్సుతో నాకు కన్పించారు. దగ్గరకెళ్ళి "నమస్తే" అన్నాను. ఏదో ఆలోచిస్తూ వున్నవారిలా వున్నారు! గబగబా వారిని అనుసరిస్తూ "రాత్రి కలలో అమ్మాయిలు నా పై పడినట్లు, ఇంకా ఏవేవో కలలు వచ్చాయి సార్" అన్నాను. వారదేమీ పెద్ద తప్పుగా పట్టించుకోక "ఆ! ఏముందిలేవోయ్, యవ్వనంలో ఇవి సహజం. భౌతిక వాంఛలను గూర్చిన భావాలు అణచబడి వుంటాయి, అవే స్వప్నంలో వస్తాయి అంతే" అని రూం వైపు సాగారు. నేను "అదెలా వాటి గూర్చి తలచుకోలేదు కదా?" అంటూ నసిగాను."అదేం లేదులే, అవి సహజమే ఈ వయస్సులో. వాటిపట్ల నీకు మమకారం లేకుంటే సరి" అన్నారు. అయినా నేను సాధనకు పనికిరాననే భావం మాత్రం చాలా రోజులు వదల్లేదు.

గృహస్థులైన శిష్యుల యెడ. మాస్టరుగారు ఎంతో ప్రేమ కనపరచేవారు. వారికి ఇంటికెళ్ళేప్పుడు ప్రసాదాలను ప్రత్యేకంగా ఆశీర్వదించి యిచ్చేవారు. మరీ రాలేనివారుంటే వారి యింటికి ప్రసాదం పంపేవారు. నేనే చాలాసార్లు యిచ్చేవాడిని.

ఒకసారి నాతో "ఏమోయ్ నీవు ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు! నాకు పప్పన్నం ఎప్పుడు పెడతావు! నీవు పెళ్ళి చేసుకుంటే నీ యింట్లో పదిరోజులుంటాను. ఎవరైనా చూచుకున్నావా? లేకపోతే చూడమంటావా? నీకు నచ్చిన వాళ్ళుంటే చెప్పు, మాట్లాడతా!" అన్నారు. నేను అప్పుడు వంట చేసుకొని తినేవాణ్ణి. "మీరు ఎప్పుడు వస్తే అప్పుడు మీకు భోజనం పెడ్తా సార్" అంటే, "నాకు నీ చేతి వంట ఎందుకోయ్!" అన్నారు. నేను మౌనంగా వున్నాను.

విద్యానగర్ లో నేను, రఘురాం, శేషగిరి ముగ్గురం కలిసి మాస్టరుగారి దగ్గరకెళ్ళాం. మాటల సందర్భంలో "హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసుకుంటా సార్" అన్నాను. "ఎప్పుడు వెళుతున్నావోయ్" అని చాలా స్పీడ్ గా అన్నారు. నేను వుక్రోషంగా "వచ్చే నెల్లో పోతా సార్" అంటే, "పెళ్ళి చేసుకోవాలని నీ ప్రారబ్దంలో వుంటే నీవేమి చేస్తావ్" అన్నారు. "తీవ్ర సాధన ద్వారా క్షయమౌతుందని రామకృష్ణ పరమహంస చెప్పారు సార్! నేనలా చేస్తాను" అన్నాను. తర్వాత కొన్ని రోజులు తీవ్రంగా సాధన చేస్తుంటే అనేక విధాల శారీరక బాధలు, మానసిక బాధలు వచ్చి హిమాలయాల ఆలోచన విరమించుకున్నాను. ఒక మిత్రుడు మాస్టరుగారి గురించి, సాయిబాబా గురించి చెప్పాడు. మాస్టరుగారు నాకు తెలుసని చెపితే, చాలా సంతోషించి, ఒక రోజు "వారి వద్దకు వెళ్ళాలని వుంది, నీవు కూడా రా" అంటే వెళ్ళాము. ఆ రోజు నన్ను వుడికించాలని "ఏమోయ్ హిమాలయాలకు తపస్సు కెళ్ళలేదా?" అన్నారు. నేను "తర్వాత వెళ్ళదామని ఆగాను సార్" అన్నాను.

ఆ రోజు నా జీవితంలో మరువరాని రోజు. "అలా తపస్సుకు వెళ్ళాలనుంటే ఇలా వుండకూడదోయ్. అక్కడ గంగానదిలో చిటికిన వేలు ముంచావనుకో, అంతే, ఆ చలికి ఎంత మునిగిందో అంత భాగం స్పర్శలేకుండా పోతుంది. ఇంక అక్కడ ఆశ్రమాలన్నీ అంతంత మాత్రమే. కొద్దిలో కొద్ది శివానందాశ్రమం బెటరు. ఇంక అక్కడ కెళ్ళాక అక్కడి బాధలన్నీ చూచి 'ఎందుకొచ్చామా?' అనే స్థితికి మనస్సు రాకూడదు. ఇక్కడ శరీరానికి, మనస్సుకు అక్కడి పరిస్థితుల కనుగుణంగా చక్కటి తర్ఫీదు పొందిన తర్వాత వెళితే గమ్యం చేరుతాము. అలాంటి తర్ఫీదు, వివేక వైరాగ్యము పొందకుండా పోతే పతనమై రెంటికీ చెడ్డ రేవడై పోతావ్" అంటూ ఇంకా అక్కడ వుండే సాధక బాధకాలన్నీ దయతో నాకు వివరించారు. అంతే అప్పటికప్పుడు వారి సన్నిధిలోనే వుండి ఆయన ఆజ్ఞాపించాకే వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. అప్పటి నుండి రోజూ సత్సంగానికి క్రమం తప్పకుండా హాజరయ్యేవాణ్ణి.

ఒకసారి వెంకట రమణారెడ్డి అనే యువకుడు "మాస్టరుగారు, నాకు మీ అంతు చూడాలని వుంది" అన్నాడు. అంటే మీరేమిటో (పూర్తిగా) తెలుసుకోవాలని వుంది అని. అందుకు మాస్టరుగారు "తర్వాత నీ వుండవోయ్" అని చురకంటిచారు. అంటే ఆయనను తెలుసుకోవాలంటే 'నేను', 'నీవు' అనే భావన నశించాలని ఆయన భావం.

వేదమ్మ చిన్న పాప. అప్పుడు సాయంకాలం అక్కడ పచ్చిక మేయడానికి గొర్రెలు వచ్చాయి. కిటికీలోంచి మాస్టరుగారు చూస్తూ "వేదమ్మను బయటికి తీసికెళ్ళి ఆ గొర్రెలను చూపించరా" అన్నారు. నేను వెంటనే వేదమ్మను ఎత్తుకొని ఆ గొర్రెల దగ్గరకు పరుగెత్తాను. అక్కడ వాటిని వేదమ్మ పట్టుకునేందుకు దగ్గరకెళితే అవి దూరంగా వెళ్ళేవి. మరలా బుడిబుడి అడుగులతో పరుగెత్తేది. మరలా అవి వెళ్ళేవి. నేను చూస్తూ వున్నాను. కాసేపటికి మాస్టరుగారు అక్కడికొచ్చి

ఒక చిన్న గొర్రెపిల్లను పట్టుకున్నారు. అది చూచి దాని దగ్గరకొచ్చి చేత్తో తాకుతూ కేరింతలు కొడుతూవుంటే, మాష్టరుగారు ఎంతో సంతోషంగా గొర్రెపిల్లను ఎత్తుకున్నారు. అప్పుడే వాకాడు నుంచి నారాయణమూర్తిగారు అక్కడకు వచ్చారు. "ఏసుక్రీస్తులాగా వున్నారు సార్" అంటూ నమస్కారం చేసారు. అప్పుడు గుర్తించాను నేను, అచ్చం ఏసుక్రీస్తు గొర్రెపిల్లను ఎత్తుకున్నట్లుగా (చాలా ఫోటోలలో) వుంది. నా మనస్సు పులకరించింది. అప్పుడు మాష్టరుగారు తెల్లని గ్లాస్కో పంచె, తెల్లని బనీను వేసుకొని సంధ్యకాంతులు ముఖబింబం పై పడడం వలన ఎంతో అందంగా వుంటే అలా నన్ను నేను మరిచి చూస్తుండిపోయాను.

ఒకసారి మాష్టరుగారు వార్తాలాపం చదువుతున్నారు సత్సంగంలో. అందులో ఒక గురువుగారు అనేక ఆశ్రమాలు కట్టించి, శిష్య ప్రశిష్యుల చేత గ్రామగ్రామాన పూజలు, పల్లకీ సేవలు చేయించుకుంటూ వుంటారు. ఒక గ్రామంలో ఆ గురువుగారు పల్లకీలో వూరేగనున్నారు. ఆ పల్లకీ అన్ని వైపులా మామిడితోరణాలు, రంగురంగుల పూల అలంకరణలతో ఎంతో అందముగా వుంది. ఆ దారిలో ఒక ఒంటె వెళుతూ పల్లకీ పైన ఆకుల కొరకు మెడ చాచింది. అంతే పల్లకీ ఒంటె మెడకు తగుల్కొంది. దానికి బెదురు పుట్టి పరుగెత్త నారంభించిందది. లోపల 'దంభి' గురువుగారు గజగజ వణుకుతున్నారు. పాపం గురువుగారి శక్తి ఒంటెకు తెలీదాయే! శిష్యులు పల్లకీ వెనుక పరుగు తీస్తుంటే దానికింకా కంగారు పుట్టి అటూ, ఇటూ పరుగెత్తడం, పాపం డంబాలు పలికిన గురువు అవస్థ వర్ణించటంతో మాష్టరుగారితో సహా సత్సంగ సభ్యులంతా కూడా కడుపుబ్బ నవ్వసాగారు. నవ్వులతో ఆ రూమ్ ప్రతిధ్వనించింది. అప్పుడు వేదమ్మ నన్ను చూచింది. మరుసటి రోజు వేదమ్మ నేనెలా నవ్వుతానో అలానే "ఆహాహాహా " అని అంటూ ఇమిటేట్ చేసింది. దాన్ని చూచి అందరూ తమాషాగా "వేదమ్మా ప్రసాదన్న ఎలా నవ్వుతాడు" అనేవారు, "ఆహాహాహా.." అనేది వేదమ్మ. అంతా పగలబడి నవ్వేవారు. అలా కాలమేమీ తెలియని లోకంలో వుండేవారం.

మాష్టరుగారింట్లోకి కావాల్సిన నీళ్ళను బావిలోనుంచి వారే స్వయంగా రెండు బక్కెట్ల నిండా చేది, రెండు చేతులతో మోసుకొని ఇంట్లో తొట్టిలో పోసేవారు. ప్రతిరోజూ అలానే చేసేవారు. ఎవ్వరినీ చేయనిచ్చేవారు కాదు. ఏ పని చెప్పితే ఆ పనే చేసేవాళ్ళం. తప్పితే వారు అనుమతి లేకుండా ఏ పనైనా చేస్తే వారి తీక్షణమైన చూపుకు బలయ్యేవాళ్ళం. అందుకే చాలా జాగ్రత్తగా వుండేవాళ్ళం అందరమూనూ. నేను ఒకసారి వారు నీరు చేదుతుంటే చూచి బావి దగ్గరకెళ్ళా. ప్రశ్నార్థకంగా "ఏమిటి?" అన్నట్లు చూచారు. "నేను నీళ్ళు తెచ్చి పోస్తా సార్" అన్నాను. "ఏమక్కర్లేదు" అంటూ రెండు చేతులతో బక్కెట్లు పట్టుకుని ఇంట్లో కెళ్ళారు. ఈ లోపల అక్కడున్న చేదతో నీళ్ళు తోడి పెట్టి నుంచున్నాను. నాకు లోపల దడ. నే చేదిన నీళ్ళు బక్కెట్లో పోసుకుంటారా? క్రింద పోసేస్తారా? అని ఎదురుచూడసాగాను. ఇంట్లో ఇంక నీళ్ళు అక్కర్లేదు కాబోలు బావి దగ్గరకు రాలేదు మాష్టరుగారు. ఆ చేద బావి దగ్గర వుంటుంది. రూం కొచ్చేవాళ్ళు చేదుకుని కాళ్ళు కడుక్కుని రావటానికి వుపయోగిస్తారు. మాష్టరుగారికి నీళ్ళు చేదిపోయాలనే నా ఆశ నిరాశే అయింది ఆ రోజు.

నా మొదటి యత్నం అలా విఫలమైంది. మరుసటి రోజు – మాష్టరుగారు బావి దగ్గరకొస్తే ఎలాగైనా ఆ సేవ చేయాలనే పట్టుదలతో కాపుకాసాను. బక్కెట్లతో బావి దగ్గరకొచ్చి నీళ్ళు చేదుతున్నారు. నేను తిన్నగా అక్కడకొచ్చి వెళ్ళి నిలుచున్నా. నన్ను చూచి అవీ ఇవీ మాట్లాడుతున్నప్పుడు, "సార్! నే చేది పోస్తా" అన్నా. 'నీ పని నువ్వు చూచుకో' అన్నట్లు చూచి రివ్వున ఇంట్లోకి బక్కెట్లు తీసుకొని వెళ్ళారు. నా మనసు చివుక్కుమంది. వారు వచ్చే లోపల చేద బావిలో వేసి గబగబా చేది పెట్టేశాను. వారు నేరుగా బావి దగ్గరకొచ్చి చిన్న బకెట్లో నీళ్ళు పెద్ద బక్కెట్లో పోసుకున్నారు గానీ, చేద ఇవ్వలేదు. సరికదా, బక్కెట్లు నిండిన తర్వాత చేద బావిలో వేసి చేది పెట్టి వెళ్ళారు. నే చేది పెట్టే అవకాశం లేకుండా చేశారు. అంతే నాలో పట్టుదల వచ్చి ఈసారి వారు రాగానే వారినేమీ అడగలా. నేను ఆ చేదలోని నీరు బక్కెట్లలో పోసి, బావిలో వేసి చేదడం ప్రారంభించాను. ఆవేశంతో నే చేసే పనిని చూస్తుండిపోయారు. నా మనసు ఆ సమయంలో ఎలా వుందో చూస్తున్నారనిపించి, "ఈ సేవ వల్ల నాకెలాంటి పుణ్యమూ అక్కర్లేదు. సేవ చేయనిస్తే చాలు" అని నా మనస్సులో అనేకసార్లు అనుకుంటూ బక్కెట్లని నింపి బాత్ రూం వరకు తీసుకెళ్ళి పెడితే, వారు ఇంట్లోకి తీసుకెళ్ళారు. అది మొదలు నేను ఎప్పుడు విద్యానగర్ లో ఆ సమయంలో వుంటే నీరు

చేది పోసేవాడ్ని. నేను చేది పోసేది చూచి కొన్ని రోజులకు దామూ, ఇంకొంతమంది భక్తులూ ఆ సేవ చేసేవారు.

1978 గురువారం భజన తర్వాత 'సాయిమహారాజ్ కీ జై' అన్నారంతా. 'భరద్వాజ మహారాజ్ కీ జై' అన్నారు మెట్టునుంచి వచ్చినవారంతా. మాస్టరుగారు ఉగ్రులై పోయారు. "ఇంకెప్పుడూ అలా పిలవకండి. మా గురువుగారంటే ఏమనుకున్నారు? అలాంటి సద్గురువు దగ్గర అలా అన్పించుకోటమా?" అంటూ వివరించారు.

ఒకసారి మాస్టరుగారి పుట్టినరోజు వచ్చింది. అప్పట్లో మాస్టరుగారి పుట్టిన రోజున ఏమేమి చేయాలో ముందుగానే ప్లాన్ వేసేవారమే కాదు! కాని ఒకరు తాటాకులు తెచ్చి పందిరేస్తే, ఇంకొకరు బొబ్బట్లు చేస్తే, వేరొకరు గులాబ్ జాం తెస్తే, ఇంకొకరు ఇంకొన్ని వస్తువులు తెస్తే అన్నీ ఏ సమయానికి ఏదుంటే బాగుంటుందనిపిస్తే అది తెచ్చేవారు. చివరకు ఆ వేడుక ఎంతో సంబరంగా జరిగేది. సాయంకాలం మాస్టరుగారు ఇంట్లో నుంచి సత్సంగహాల్ లోకి వచ్చారు. ఎంతో అందంగా కన్పిస్తున్నారా రోజు. నుదుట కుంకుమ అర్ధచంద్రాకృతిలో వుండి, క్రిందకి కొద్దిగా వంగి శోభాయమానంగా వెలిగిపోతున్నది. ముందు బాబాకు జై అని చెప్పి అగరొత్తులు వెలిగించి ఎంతో ఏకాగ్రతతో బాబాను చూస్తూ అనేకసార్లు తిప్పి, వాటిని చేతుల్లోనే పెట్టుకుని కొద్ది సేపు కళ్ళుమూసుకొని తీవ్రమైన ధ్యానంలోకి వెళ్ళారు. నేను కన్నార్పకుండా చూస్తూ వున్నా పిచ్చివాడిలా. నెమ్మదిగా ఒక్కొరొక్కరు గదిలోకి ప్రవేశించి వారి దివ్యమంగళ విగ్రహానికి నమస్కారం చేసుకున్నారు. కొంతసేపు సత్సంగం చేసి భజనానంతరం ఆరతి కర్పూరం వెలిగించి బాబా వైపు తిప్పుతుంటే ఆ వెలుగు ఈయన ముఖం పై పడి వివిధ కాంతులు వెదజల్లుతూ వుంది. అందరకూ ప్రసాదం పెట్టి పంపారు. తర్వాత నేను, "సార్, ఒక్కసారి మీకు పూజ చేసుకుంటా" నని అడిగాను. వారు ధ్యానస్థులై వున్నారు. మేం అందరం వారిని కుర్చీలో కూర్చోబెట్టి పళ్ళెంలో పాదాలుంచాము. ఒక్కొక్కరూ పాదాల పైన నీరు పోసి కడిగి ఆ నీళ్ళని శిరస్సున ధరించారు. తర్వాత అమ్మగారిని కూర్చిలో కూర్చోబెట్టాము. మాస్టరుగారికి నేనే హారతిచ్చాను. అందరూ చూస్తుంటే మౌన సముద్రంలో వున్నారు మాస్టరుగారు. అందరికీ విభూతి తీర్థం ఇస్తుంటే అమ్మగారు ప్రసాదం పెట్టారు. అందరూ చాలా గంభీర ముద్రదాల్చారు. ఎవ్వరికీ నోటమాట రాలేదు. అదో తమకం, మైకంలో మునిగిపోయారు. అలాంటి భావం మరలా ఏ రోజూ రాలేదు.

**- సశేషం**

## "ఈ సొమ్ము మాధవునికొక లెక్కలోనిదా?"

06వ పేజీ తరువాయి

తగ్గిపోయింది. డాక్టరు వచ్చి చూసి ఇంకేమీ ఫరవాలేదన్నాడు. బిడ్డ ఆడుకొంటున్నాడు. అప్పుడు భట్టుగారికి సాయి సాక్షాత్తు దత్తమూర్తియనే విశ్వాసము కలిగింది. వెంటనే బాబా పటానికి సాష్టాంగ ప్రణామము చేశాడు. 15 రోజులలో తన మాట ప్రకారము శిరిడీ వెళ్ళి సాయిని దర్శించాడు. తానింకా ఏమీ మాట్లాడలేదు. ఇతనిని చూడగానే ప్రక్కవారితో సాయి "ఈ పెద్ద మనిషి నన్ను కుక్క, పిల్లి, ముస్లిము అని అన్నాడు" అన్నారు. భట్టు సాయియొక్క అంతర్ జ్ఞానమున కాశ్చర్యపడి, వారి పాదములకు నమస్కరించి ₹108/- దక్షిణ సమర్పించాడు. తిరిగి సాయంత్రము మశీదుకు వెళ్ళినప్పుడు సాయి ₹108/- దక్షిణ అడిగారు. "ఉదయమే గదా ₹108/- ఇచ్చాడు" అన్నాడు శ్యామా. బాబా "ఈ సొమ్ము ఇతనికొక లెక్కలోనిదా? దీనికి పదిరెట్లిస్తాడు తర్వాత" అన్నారు. అక్కడున్న వారికిదేమీ అర్థమవలేదు. భట్టుకింక మతిపోయినంతపనైంది. తాను "సాయీ! నాకొక సం॥లో పుత్రుడు కలిగితే మీకు ₹1008/- దక్షిణ సమర్పించుకొంటా" నని ప్రార్థిస్తున్నాడు. అప్పుడే సాయికి తెలిసిపోయింది! సం॥లోగా భట్టుకు పుత్రుడు కలిగాడు ఆయన సాయికి ₹1008/- దక్షిణ సమర్పించుకొన్నాడు. అప్పటి నుండి పూజాగృహములో సాయిపటముంచి వారినే దత్తమూర్తి అని భావించి పూజించుకొనేవాడు. ఈ విధంగా తన వేషభాషలు చూచి ముస్లిమని భ్రమించిన వారి భ్రమను సాయి ఎలా పోగొట్టారో, వారి కోరికలు తీర్చి ఎందరిని శుభ్రమార్గమున పయనింపజేశారో మనకేమి తెలుసు?

# అబ్దుల్లా జాన్

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

బాబా తాము యే మతానికి చెందనిరీతిన జీవిస్తూ, సర్వమత సామరస్యం మానవాళికి బోధించారని మనమీనాడు గ్రంథాలలో చదువుకుంటుంటే అదంతా ఒక మధురమైన కలలాగ అన్పిస్తుంది. కాని ప్రజలలో ఆచారాలు, సాంప్రదాయాలు ఎంతో బలీయంగావున్న ఆ కాలంలో ఆయన భౌతికదేహంతో వారిమధ్య జీవిస్తూ అనుక్షణము రెండు మతాలవారి సంకుచిత దృష్టినీ ఎదుర్కొనవలసి రావడమెంత కష్టమో మనం ఊహించవచ్చు. కాని అన్ని మతాలలోను వివేకము, సహృదయత గలవారెప్పుడూ వుంటూనే వున్నారు. ముస్లిములలో అటువంటివారు ఆయనవద్ద కొచ్చిన సంగతులు ఎక్కువ భాగం చరిత్ర కెక్కలేదు. వారిలో కొద్దిమంది వద్ద మాత్రమే కీ॥శే॥ బి.వి. నరసింహస్వామి సేకరించి మనకందించగలిగారు. అట్టి ముస్లిం భక్తులలో అబ్దుల్లా జాన్ ఒకడు. ఇతడు సాకోరీకి 4 మైళ్ళలో వున్న కోర్హాలా గ్రామంలో నివసిస్తుండేవాడు. అక్కడనుండి తరచుగా బాబా దర్శనానికి వస్తూండేవాడు. ఇతడు స్వతహాగా పెషావర్ లోని హజరా జిల్లాకు చెందిన టర్బెల్లా గ్రామస్థుడు. పఠాన్ జాతివాడు. అతడు తన బాల్యంలోనే స్వగ్రామం విడిచి వచ్చేశాడు. కారణం అతడికి నా అన్నవారెవరూ లేరు. తాను విదేశాలకు వెళ్ళి మక్కా, మదీనా బాగ్దాద్ వంటి ముస్లిం పుణ్యక్షేత్రాలు సందర్శించదలచాడు. దారిలో, సాయిబాబా అను ముస్లిం సిద్ధ పురుషుడు శిరిడీలో వున్నారని, ఆయన ఫకీర్లకు ఉదారంగా కానుకలు యిస్తారని విన్నాడు. ఆయన తననుగూడా మక్కాకు పంపగలరని ఆశించి 1913లో శిరిడీ వచ్చాడు. నాటి స్మృతులు, అటుతర్వాత సాయితో తనకుగల అనుభవాలు యిలా వ్రాశాడు:

"నేను మశీదు గేటులో ప్రవేశించేసరికి బాబా మశీదులో వున్నారు. నేను ఆయనవంక, ఆయన నావంక చూచుకున్నాము. మా కన్నులు కలుసుకున్నాయి. తక్షణం ఆయనే నా గురువని తోచి శిరిడీలోనే వుండిపోయాను. ఆయన నన్ను, కొందరు ఫకీర్లనూ పుష్కలంగా పోషిస్తుండడంతో నేను వారిచెంతనే జీవితం సుఖంగా గడుపుతూ వుండి పోవాలనుకున్నాను. చిన్నవయసు కావడంవలన నాకు జీవితంలోని గంభీరమైన విషయాలగూర్చి అవగాహనలేదు. అయినా బాబాతో కలిసివుండడంవల్ల నా మనసు మారింది. నేను శిరిడీ వచ్చేనాటికి హిందువులందరినీ నా శత్రువులుగా తలచేవాణ్ణి. 3 సం॥లు బాబాతో కలిసి జీవించాక హిందువులను నా సోదరులుగా తలచనారంభించాను. ఇపుడు బొంబాయిలోని హిందువులు మశీదులను, ముస్లిములను నాశనం చేయాలనీ, ముస్లిములు హిందువులను, వారి దేవాలయాలను నాశనం చేయాలని తలచడం చూస్తే నాకెంతో బాధవేస్తుంది. ఇద్దరూ ఒకరినొకరు నాశనం చేసుకోవడం జరిగితే వారి వారి స్థానంలో యితర మతాలవారికి తావేర్పడుతుంది.

బాబా మహాసమాధి చెందేనాటికి నా వయసు 22 సం॥లే. కనుక వారినుండి నేను ఆధ్యాత్మికంగా చాలినంత మేలు పొందలేకపోయాను. నేను బాధతో యాత్రలు చేయసాగాను. నేను 1926లో ఉత్తరదేశానికి తిరిగి వెళుతున్నాను. శ్వాట్ లోయలో 'అకుణ్ బాబా' అను మహాత్ముని దర్గా చూసాను. అతడు మహమ్మద్ ప్రవక్తగారి వంశస్థుడు. (సయ్యద్), లార్డ్ రాబర్ట్సు అను ఆంగ్ల సేనాధిపతి పశ్చిమ ప్రాంతంలోని ముస్లిం జాతులను అణచివేయడానికి తరలి వస్తుండగా ఒకచోట ఒక్క అడుగుగూడ ముందుకు వేయలేక నిలిచిపోయాడు. అకుణ్ బాబా తమ అద్భుతశక్తిచేత లార్డ్ రాబర్ట్సు ను పదకొండు మాసాలపాటు ఒక కొండమీద నిలిపివేసారు. అతడు తన స్థితి విక్టోరియా రాణికి

తెలుపుకున్నాడు. ఆ రోజుల్లో అకుణ్ బాబా మహిమల గురించి ప్రజలెంతగానో చెప్పుకొనేవారు. నేనొకరాత్రి ఆయన సమాధి వద్ద నిద్రచేశాను. సాయిబాబా నన్ను తమ రక్షణలోకి తీసుకుని ఉద్ధరించాలని ప్రార్థించుకొని పడుకున్నాను. నాటి రాత్రి నాకు దర్శనమిచ్చినది అకుణ్ బాబా కాదు; సాయిబాబా నాతలవద్ద కుర్చీలో కూర్చుని దర్శనమిచ్చారు గాని ఏమీ మాట్లాడలేదు. నిద్రలేచాక నిజానికి నేనింకా సాయిబాబా రక్షణలోనే వున్నానని తెలుసుకున్నాను. నేను ఆయనను ప్రార్థించలేదు. అకుణ్ బాబానే ప్రార్థించాను. కాని సాయిబాబా నాపై దయతో శిరిడీకి 1500 మైళ్ళ దూరంలోవున్న నావద్దకు తమకై తామే వచ్చారు; కనుక 5సంIIలు వారి చెంతనున్నప్పటికీ వారు నాకెట్టి సహాయమూ చేయక వంచించారన్న నా భావం సరిగాదని గుర్తించాను. ఈ దర్శనమయ్యాక వారిపై నా విశ్వాసం పెరిగి తిరిగి శిరిడీ ప్రాంతాలకు వచ్చేశాను. నేను సంII 1924లో వివాహం చేసుకొని సాకోరీకి 4 మైళ్ళలోవున్న కోర్హాలా లో వుంటున్నాను. రెండు, లేక నాలుగు సంIIలకొకసారి బాబా నాకు దర్శనమిస్తుంటారు. వారి జీవితకాలంలో ఆయన చుట్టూ జనం చేరడంవల్ల మశీదులో ఆయన చెంతన కూర్చోవడానికి చోటు దొరికేదికాదు. కుక్కలు మొIIన ప్రాణులు వారిచుట్టూ ఎన్నిచేరేవో! ఇపుడు (1925 ప్రాంతంలో) దాదాపు అంతమంది జనంగానీ, కుక్కలవంటి ప్రాణులుగాని అక్కడలేవు. మశీదు దాదాపు నిర్మానుష్యంగా వుంటోంది. బాబా అంతటివారి వైభవమే యింత అశాశ్వతమైతే, యింతత్వరగా అంతరించిపోతే, యిక నాలాటి క్రిమి సంగతి వేరే చెప్పాలా?

బాబా సన్నిధిలో నేను చూచి నప్పుడు రోహిల్లాలు ఎవరూ లేరుగాని, వారి వద్ద కొచ్చిన పఠానులు కొందరు మతమౌఢ్యం వహించారని తెలుసు. బాబా సాహెబ్ తార్కాడ్ నాకొక సంఘటన గురించి చెప్పాడు; ఒకనాటి రాత్రి అతడు చావడిలో బాబా ప్రక్కన పడుకున్నాడు. అంతకు కొద్దిముందే కాందహార్ నుండి వచ్చిన మీర్జమాన్ అనే పఠాను తెల్లవారు ఝామున 3గంIIలకు అకస్మాత్తుగా నిద్రలేచాడు. అచటి హిందువులందరూ యిస్లాం ధర్మాన్ని పాడుచేస్తున్నారని, కనుక తాను కత్తి పట్టి వారి గొంతులు కోసివేసి వారి బారినుండి బాబాను విడిపించనివ్వమనీ బాబాను అనుమతి కోరాడు. అదంతా భయంతో విన్న తార్కాడ్ ఆ దుష్టుడు తననుగూడ నిర్దాక్షిణ్యంగా హతమారుస్తాడేమోనన్న భయంతో ఆ మాటలు వింటున్నాడు. కాని సాయిబాబా తాము కేవలమొక పిచ్చిఫకీరని, తమను పూజించే హిందువులందరూ పిచ్చివారేనని, వారు తమను ఆరాధించడానికి కారణం వారి పిచ్చేననీ చెప్పి అతనిని సమాధానపరచారు. మీర్జమాన్ గొంతులే కోయదలిస్తే తమ గొంతే కోయాలని, ఆ హిందువుల గొంతు కాదనీ చెప్పారు. ఆ తరువాత మీర్జమాన్ వూరుకున్నాడు.

నాగపూర్ కు చెందిన అబ్దుల్లా ఖాన్ అను మరొక ముస్లిం మూడు, నాలుగు మాసాలు బాబా సన్నిధిలో వున్నాడు. బూటీ, మహాత్మాగాంధీ వంటి ప్రముఖులతో సన్నిహిత పరిచయంగల అతడు ఒక పత్రికా విలేఖరి. అతడు భారతదేశానికి పఠానేగాని రోహిల్కండుకు చెందినవాడు కాదు. అతడి హృదయంగూడ పరమత ద్వేషంతో నిండివుండేది. అతడు శిరిడీలో వున్నప్పుడు బాబా అప్పుడప్పుడు తనను వంచించారని చెప్పుకుంటుండేవాడు. ఒకసారి యితడు నానా చోప్దార్ ను కొట్టడంవలన కోపర్గాం మెజిస్ట్రేట్ అతడికి జైలుశిక్ష లేక ₹15/-లు జరిమానా చెల్లించాలనీ శిక్ష విధించారు. అతడి తరపున హామీ యిచ్చేవారు లేనందువలన కొద్దికాలం అతడు జైల్లో వున్నాడు. అపుడు బూటీ ఆ ₹15/-లు అతడికి పంపారు. అతడది తీసుకొనక, "నన్నెవరు వంచించారో ఆయనే ఆ ₹15/-లు చెల్లించాలిగానీ యింకెవరుగాదు" అన్నాడు. అపుడు బాబా తమ జేబులోనుండి ₹15/-లు తీసి పంపించి అతనిని విడుదల చేయించారు. ఇతడొకప్పుడు బాబాతో, 'ఇక్కడ మీరీ తతంగమంతా జరగనిస్తూ పవిత్రమైన యిస్లాం ధర్మాన్ని భ్రష్టం చేస్తున్నారు, మీ గొంతు కోయవలసినదే?' అన్నాడు. అపుడు బాబా ఫక్కున నవ్వారు. వెంటనే అతడు ఆయనను క్షమాపణ కోరాడు. బాబా మళ్ళీ అలానే నవ్వారు.

బాబా సశరీరులుగా వుండగా ఆయన త్వరలో సమాధి అవుతారేమోనని, అంతటితో వారి ప్రభావమంతరించి పోతుందేమోననీ ఎవరో ఆయనతో అన్నారు. అపుడాయన మరాఠీ భాషలో, "నేను సమాధిలో వుండిగూడ అవసరమొస్తే కర్రతో కొడతాను" అన్నారు. అంటే ఆయన శరీరం త్యజించాకగూడ వారి ప్రభావము, సామర్థ్యమూ అంతరించిపోవని వారి భావం.●

# ద్వారకామాయి అనుభవమండపము

**శ్రీ ఏ. రాంబాబు**

అది నవంబరు నెల 5వ తారీకు. గురుపూర్ణిమ సందర్భముగా వినుకొండ సాయిబాబా మందిరంలో మా మిత్రులు ఒంగోలు తూనుగుంట వెంకటేశ్వర్లు బృందం వారు సాయిబాబా మీద భక్తిగీతాలు కచేరి ఇస్తున్న సందర్భముగా వినుకొండలో మందిరం కమిటీ వారు నన్ను కూడ ఆహ్వానించినందున నేను ఆ ప్రోగ్రాంకు వెళ్ళినాను. ఆ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసినది. ఆ తరువాత మేము అందరం ఒంగోలుకు తిరిగి వస్తూ నేను కూడ సాయినాథునికి ఒక కోరిక విన్నవించుకొన్నాను.

నా కోరిక ఏమిటంటే నాకు పెళ్లి కావలసిన ఒక చెల్లెలు ఉన్నది. ఆ అమ్మాయికి వీలు అయినంత త్వరగా పెళ్ళి జరగాలి. "తొందరగా కనుక పెళ్లి కుదిరితే ఆ వివాహము నీ సన్నిధిలోనే జరిపిస్తాను" అని విన్నవించుకొన్నాను. నా విన్నపమును మన్నించి సాయినాథుడు నెల తిరగకమునుపే దయ చూపాడు. మా చెల్లెలుకు డిశంబర్ 2వ తారీకున ఒంగోలులో ఒక పెళ్ళి సంబంధం వాళ్లు వచ్చి చూచినారు. వాళ్లు 'అమ్మాయిని నచ్చాము' అని చెప్పగా డిశెంబర్ 8వ తారీకున రాత్రికి కట్నకానుకలు మాట్లాడుకొని డిశంబర్ 12 తారీకున ఉదయం 8-24 ని॥లకు ఒంగోలు సాయినాథుని మందిరంలో చేయుటకు వివాహ ముహూర్తాలు పెట్టుకున్నాము. పెళ్లి ముహూర్తాలు పెట్టుకొనేటపుడు నావద్దగాని మా నాన్నగారి వద్దగాని



నయాపైస మా స్వంత డబ్బులు లేవు. కాని మా బంధువులలో కొంతమంది తలాకొంచెం యివ్వడంతో ఏ కొరవా లేకుండా వైభవంగా వివాహం జరిగిపోయినది. పెళ్ళికి 3 రోజులు టైములో ముహూర్తాలు నిర్ణయించుకొన్నాము. చేతిలో డబ్బులు లేవు. ఎలా పెళ్లి చెయ్యాలో అర్థంకాక ఎంతో మదన పడినాము. సాయినాథుడే కొంతమందిలో జొరపడి మాకు అవసరం అయినంత డబ్బు యిప్పించినాడు. నిజంగా ఆ సాయినాథుని కృప మా యందు లేని యెడల మేము ఏ మాత్రం చేయగలిగే వాళ్ళం కాదు. యీ కార్యనిర్వాహణలో యిద్దరు వ్యక్తులు (బంధువులలో) నిలబడి తమ స్వంత పనిలాగా చేసారు. ఏ దిక్కులేని మాకు సాయినాథుడే స్వయంగా నిలబడి చేసినట్లుగా భావిస్తున్నాను. •

# ఆచార్యుని అద్భుత లీలలు

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి లీలావైభవాన్ని, సూళ్ళూరుపేట సత్సంగ సభ్యులు, శ్రీమతి మునీలా గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి వి.సి.వెంకటేశ్వర్లు గారి ద్వారా తెలిసింది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు విద్యానగర్లో వుండేవారు. మా పెద్దబ్బాయికి ఐదు సంవత్సరముల వయసున్నప్పుడు, చెవిలో నొప్పి వచ్చి, రక్తం కారేది. మేము వాడిని మద్రాస్ తీసుకుపోయాము. అక్కడి డాక్టర్లు, “దీనికి ఆపరేషన్ చేయాలి. రాయవెల్లూరు తీసుకు వెళ్ళండి” అని చెప్పారు. సరేనని అక్కడకి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించాం. ఇంటికి వచ్చిన తరువాత కూడా మళ్ళీ అలాగే రక్తం కారుతూ వుంది. అప్పుడు విద్యానగర్ లో పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకి వెడితే, ఆయన బాగుచేయగలరని వి.సి. వెంకటేశ్వర్లు గారు చెబితే, ఒకరోజు విద్యానగర్ వెళ్ళాము.

అప్పుడే పూజ్యశ్రీ మాస్టరుగారు కాలేజీ నించి వచ్చారు. మమ్మలిని చూసి పలకరించారు. మేము జరిగిన విషయం చెప్పాము. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, “మీకు బాబా పటం ఇస్తాను. అది పూజలో పెట్టుకుని పారాయణలు చేసుకోండి” అన్నారు. పక్కన వున్న వాళ్లందరికీ, 108 లేదా 51 పారాయణలు చెయ్యమని చెబుతున్నారు. నాకు ఎన్ని చెప్తారోనని, “మేము తమిళియన్స్ సార్, తెలుగు అంతగా చదవలేను. చాలా సమయం పడుతుంది” అన్నాను. “అయితే మూడు పారాయణలు చెయ్యి” అన్నారు. అందుకు చాలా సంతోషమేసింది. శిరిడీకి వస్తానని మొక్కుకోమన్నారు. నేను ఇంటికొచ్చి పటం పెట్టుకోగానే, ఒకరోజు బాబా మా ఇంటికి వచ్చినట్లు కలవచ్చింది. ‘పూజ్యశ్రీ మాస్టరుగారు యిచ్చిన పటం రూపంలో బాబా మా ఇంటికి వచ్చారు’ అనిపించింది. తరువాత మా బాబుకి చెవినించి రక్తం కారడం తగ్గిపోయింది. ఇప్పుడు వాడికి 55 సంవత్సరములు, ఇప్పటి వరకు ఆ బాధ మళ్ళీ రాలేదు. తరువాత మేము శిరిడి వెళ్లి బాబా దర్శనం చేసుకుని, మా బాబు పేర ఐదుగురికి భోజనం పెట్టించాము. పూజ్యశ్రీ మాస్టరుగారి వాక్కుకి అంత శక్తి వున్నది.

కొన్నిరోజులకి నాకు విపరీతంగా నడుము నొప్పి వచ్చింది. డాక్టర్ దగ్గరకి వెడితే, ఆపరేషన్ చేయాలన్నారు. నాకు భయమేసి ఒంగోలు పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉత్తరం రాసాను. అప్పుడు, ‘నలభై రోజులు బాబా పూజ ఆపకుండా చేసుకోండి. మీవారిని పూజ చేయమనండి, మీరు పక్కన కూర్చోండి. మెన్సెస్ అయినా కూర్చోండి,



పంచపాత్రలో నీళ్లు తీసుకుని, దానిలో విభూది వేసి, నొప్పి వున్నచోట ప్రతిరోజూ రాసుకోండి” అని జవాబు యిచ్చారు. మేము అలాగే చేసాము. మావారు నలభై రోజులు పూజ చేశారు. నాకు నొప్పి తగ్గిపోయింది. ఆయన మాకు నడిచే దేవుడు!

మావారికి ఆస్తి తగాదా వుండేది. దానిలో చాలా భాగం గవర్నమెంటులోకి పోయేటట్టువుందని మేము బాధపడుతూ, ఈ విషయం పూజ్యశ్రీ మాస్టరుగారికి విన్నవించుకున్నాము. "ఏం భయపడకండి, అది మీవైపే వస్తుంది" అని చెప్పారు. ఆ తండ్రి పలుకు ఎంతగొప్పదంటే, మాకు ఏమి నష్టం లేకుండా భూమి అంతా మాకే వచ్చింది.

సూళ్లూరుపేట బాబా మందిరంలో (అప్పుడు పాక మాత్రమే ఉండేది) రోజూ సేవ చేసుకునేదాన్ని. సాయంత్రం ఐదు గంటలకి వెళ్లి, అంతా ఊడ్చి, నీళ్లుజల్లి ముగ్గు పెట్టి, దీపంపెట్టి, ఆరతి చూసుకుని వచ్చేదాన్ని. మా ఇంటినించి రెండు కిలోమీటర్ల దూరం ఉండేది. ఏదైనా ఉత్సవం వుంటే మర్నాడు పొద్దున్న కూడా వెళ్లి ముగ్గు వేసేదాన్ని. అలా చాలా సంవత్సరాలు చేసాను. అందుకేనేమో, బాబా గుడి పక్కనే నాకు స్థలం ఇప్పించి ఇల్లు కట్టించి యిచ్చారు బాబా. అదంతా ఎలా జరిగిందో ఆలోచిస్తే ఇప్పటికి చాలా ఆశ్చర్యంగానే ఉంటుంది. మా దగ్గర చాలినంత డబ్బులు కూడా లేవు. బాబా, మాస్టరుగారు తలచుకుంటే జరగనిది ఏది ఉండదు.

మా సూళ్లూరుపేటకు పూజ్యశ్రీ మాస్టరుగారు చాలాసార్లు వచ్చారు. మా ఇంటికి మూడుసార్లు వచ్చారు. నేను నామం చెప్పుకుంటూ పూజ్యశ్రీ మాస్టరుగారికి వండి పెట్టేదానిని. ఆయన ఇచ్చిన బాబా పటానికే మా ఇంట్లో పూజ్యశ్రీ మాస్టరుగారు పూజ చేశారు. మావారు కూడా మాస్టరుగారు వస్తే సేవ చేసుకునేవారు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని 'సార్' అని పిలిచేదాన్ని. మా ఇంట్లో ఇంచుమించు 12 సంవత్సరముల నుండి ప్రతి శుక్రవారం సత్సంగం జరుగుతోంది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎప్పుడు వచ్చినా ఆయనకి నా బాధలన్నీ వెళ్లబోసుకునే దానిని. ఆయన ఒక్కమాట అన్నారంటే అది జరిగి తీరవలసిందే.

అర్థాంతరంగా అందరినీ వదిలి వెళ్లిపోయారు. సమాధి అయ్యారని తెలిసిన వెంటనే ఒంగోలుకి వెళ్ళాము. అది తలచుకుంటే కలా, నిజమా అనిపిస్తుంది. సమాధి తరువాత కూడా పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు చాలాసార్లు కనిపించారు.

ఇక్కడ చంద్రబాబు అని ఒకతను ఉన్నాడు. నేను 'బాబు' అని పిలుస్తాను. నా కంటే చిన్నవాడు. అతనికి బట్టలషాపు వుంది. భార్య, ఇద్దరు ఆడపిల్లలు. ఒకరోజు సాయిబాబా నా కలలో కనపడి "చంద్రబాబుని, బట్టలకొట్టు మూసెయ్యమను. ఇద్దరు ఆడపిల్లలకి పెళ్లి చేసెయ్యమను" అని చెప్పారు. నేను మర్నాడు, బాబుతో ఈ కల సంగతి చెప్పాను. అప్పటికి బట్టల కొట్టు వ్యాపారం చాలా బాగుంది. తను నామాట నమ్మక, "ఆ బాబా నాకు చెప్పకుండా నీకెందుకు చెప్తారు" అని కొట్టిపారేశాడు. కొన్నాళ్ళకి అతని భార్య చనిపోయింది. తట్టుకోలేక బాగా ఏడుస్తూ వుండేవాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు నా కలలో కనపడి, "ఎందుకు వాడు అలా ఏడుస్తూ కూర్చున్నాడు, రోజుకొకచోటికి పోయి సత్సంగం చేసి రమ్మను," అని చెప్పారు. అప్పుడు కలలోనే, "వాడు వినడు సార్, మీరే వాడికి చెప్పండి" అన్నాను. "లేదు, ఇది నువ్వేచెప్పాలి" అన్నారు. మెలకువ వచ్చాక వాడి విషయం బాబా, మాస్టరుగారు నాకెందుకు చెప్తున్నారోనని..నేను వెళ్లి, వాడికి ఈ విషయం చెప్పాను. "నువ్వు విన్నా, వినక పోయినా మాస్టరుగారు నాకు చెప్పినది నీకు చెప్పాను. నీ ఇష్టం" అని చెప్పాను.. తరవాత వారం రోజులలో ప్రతిరోజు ఒకొక్కరి ఇంటిదగ్గర బాబు పోయి సత్సంగం చెప్పే ఏర్పాటు పూజ్యశ్రీ మాస్టరు గారే చేశారు. ఇప్పుడు సాయినగర్ లో 18 ఇళ్లల్లో సత్సంగాలు జరుగుతున్నాయి.

ఇక్కడ ఎంతమంది జీవితాలో పూజ్యశ్రీ మాస్టరుగారి వల్ల బాగుపడ్డాయి. ఆయన చెప్పిన సంప్రదాయం పారాయణ, సత్సంగం. ఇక్కడ అది చాలా బాగా జరుగుతోంది. వారు సమాధి అయ్యాక వారెంత గొప్పవారో ఇంకా బాగా తెలుస్తోంది. పూజ్యశ్రీ మాస్టరుగారికి ఎటువంటి భేదాలు లేవు. అందరికి సమానంగా వారి ప్రేమని అందించారు. అటువంటి ప్రేమమూర్తిని మళ్ళీ చూడలేము. నా వరకు నాకు, నా దైవం ఎవరంటే ముందు మాస్టరుగారిని చెప్పి, తరవాతనే బాబాని చెప్తాను. పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహము, ఆశీస్సులు ఎప్పటికిఇలాగేకొనసాగాలని,ప్రార్థిస్తూ, వారి కుటుంబమంతటికి కూడా హృదయపూర్వక నమస్కారములు తెలియజేసుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!!

## మానవత్వమా?..... దైవత్వమా?

10వ పేజీ తరువాయి

అది మాత్రమే చాలదనీ, మనలోని దుర్గుణాలను పోగొట్టుకోవాలని ఆయన బోధించేవారు. వాటిని పోగొట్టుకోవడానికి వివేకంతో ఆలోచించడం ముఖ్యమని చెప్పి ప్రతివిషయంలోను ఎలా ఆలోచించి ఆయా గుణాలను పోగొట్టుకోవచ్చో ఆయన వివరించి చెప్పేవారు. సామాన్యంగా ఇతరులెవరూ చెప్పని ఈ విషయం గూర్చి ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. కారణం రాగద్వేషాదులను, అహంకార మమకారాలను పోగొట్టుకోనిదే ఇటు సామాజిక జీవనం గానీ, అటు ఆధ్యాత్మిక జీవనం గానీ సక్రమంగా వుండడం సాధ్యంగాదని ఆయన నొక్కి వక్కాణించారు. నేడు ఈ స్వార్థ మమకారాదులు, అసూయాదుల వలననే సమాజం ఎంతగా అశాంతికి గురి అవుతున్నదో మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇక వీటిని పోగొట్టుకోకుండా ఆధ్యాత్మికతలో ఎంతగా అభివృద్ధి సాంధించినప్పటికీ అది అభివృద్ధి ఏ విధంగానూ కాజాలదనీ, దానివలన రావణాది రాక్షసులవలెనే తమ శక్తులతో, ఆధ్యాత్మికత పేరుతో సమాజాన్ని ఇంకా అశాంతికి గురి చేయడమే అవుతుందనీ, అందువలన సమాజ పతనం తప్పదని ఆయన చెప్పేవారు.

సామాజిక పరంగా గూడ – సమాజం బాగుపడడానికి అనేక సూచనలు అందించారు. విద్యావ్యవస్థను మార్చాలని, ఉపాధి వ్యవస్థను మార్చాలని, దూరదర్శన్, పత్రికలు, సినిమాలు ఇప్పుడున్న వైఖరిని మార్చుకోవాలనీ, అవినీతికి అవకాశమివ్వకూడదనీ, ధర్మప్రబోధం చేయాలనీ చెప్పేవారు. కారణం అవి అన్నింటికంటే శక్తివంతమైన ప్రచార సాధనాలు గనుక వాటిని సరియైన విధంగా ఉపయోగించుకుంటే సమాజం బాగుపడడానికి ఎంతో అవకాశముంటుందని చెప్పేవారు. ప్రతివారూ సాటివారిపట్లమానవత్వంతో ప్రవర్తించాలని, అందుకు 'సాటివారు మనకేది చేయాలనుకుంటామో అది వారికి చేయాలి' అనే సూత్రాన్ని పాటిస్తే అందరూ సుఖశాంతులతో వుండవచ్చని ఆయన చెప్పేవారు.

ఇవన్నీ వాచా బోధించడము మాత్రమే గాక ఆయన అన్నింటినీ ఉత్తమంగా ఆచరించి చూపారు. సకల జీవులపట్ల ప్రేమ, శాంతము, కరుణ, దయ, క్షమ. మిన్ను విరిగి మీద బడ్డా మొక్కవోని ధైర్యం, సాహసం, అకుంఠిత దీక్ష, విజ్ఞాన సంపద, భక్తి జ్ఞాన వైరాగ్యములు – ఇవన్నీ ఆయన సహజ గుణాలు. మానవత్వము, దైవత్వమూ మూర్తీభవించిన ఆయన పరిపూర్ణ మానవుడుగాక మరేమిటి? అందుకే ఆయన అవతారపురుషుడు.

ఈ ఫిబ్రవరి తొమ్మిది 2011న, ఆయన చెప్పిన వాటిని గుర్తు తెచ్చుకుని ఆచరిస్తూ పరిపూర్ణ మానవత్వాన్ని పొందడానికి ప్రయత్నం చేద్దాము. ●

# పరిప్రశ్న

07వ పేజీ తరువాయి

వాటి కారకులనుకున్న వారిపట్ల భావాలు మారతాయి. ఈ మార్పు వారి ప్రతి క్రియలను, వాటికి మూలమైన సంకల్పాలనూ మార్పు చేయిస్తుంది. ఉదాహరణకు విశ్వమంతా భగవంతుని రూపమన్న అవగాహనను నిత్య సత్సాంగత్యము, పూజ, ధ్యానము, సద్గ్రంథ పఠనలతో దృఢం చేసుకుంటే, మనకు చెడు చేసేవాడు అజ్ఞానం వలన, మన ఋణానుబంధం వలన అలా చేస్తున్నారని, ఆ రూపంలో మనమిదివరకు అజ్ఞానంలో చేసినదానికి ప్రతిఫలం మనమే అనుభవిస్తున్నామని గుర్తుండి, యథాశక్తి ఆ చెడును తప్పించుకోడానికి, ఆ వ్యక్తులను ప్రేమతో, అవగాహనతో సంస్కరించుకోడానికి యత్నిస్తాము. అయినా వారు చెడుచేస్తే ఓర్పుతో, ప్రేమతో ఊరకుంటాము. భాగవతంలోని భిక్షుగీత యీ తత్వాన్ని చక్కగా చిత్రిస్తుంది.

కనుక యీ యోచనలోని భేదంవలన వస్తువుల, వ్యక్తులపట్ల మన భావాలు, దానిని బట్టి వాటిపట్ల మన ఆచరణ ఉంటాయి. ఇదే వ్యక్తుల మధ్య భేదానికి కారణం. ఈ జీవిత కార్యంలో జ్ఞానేంద్రియాలన్నవి నిమిత్తమాత్రమైన పనిముట్లు మాత్రమే. యోచనాత్మకమైన మనస్సులో భేదాన్ననుసరించి జ్ఞానేంద్రియానుభవాల ప్రభావం భిన్నంగా ఉంటుంది. ●

జై సాయి మాస్టర్!

# శ్రీ 'సాయిబాబా' పాఠకులకు విజ్ఞప్తి

పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్య బోధనలను, వివిధ మహాత్ముల గూర్చిన విషయ విశేషములు, ఇంకా ఇతరములైన ఎన్నో ఆధ్యాత్మిక, విజ్ఞాన విషయాలను పఠించడం ద్వారా పూజ్యశ్రీ మాస్టర్‌గారి సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ, ఆనందిస్తున్న 'సాయిబాబా' మాసపత్రిక పాఠకులకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారి 80వ జన్మదిన సందర్భంగా శ్రీ మాస్టరుగారితో భక్తులకు గల అనుభవాలను అక్టోబరు 2017 సంచిక నుండీ ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. కనుక పాఠకులు పూజ్యశ్రీ మాస్టరుగారితో తమకుగల అనుభవాలను పత్రికకు పంపవలసినదిగా ప్రార్థన.

అదే విధంగా శ్రీ సాయినాథునితో తమకుగల అనుభవాలను గూడా పంపవలసినదిగా ప్రార్థన.

పూజ్యశ్రీ మాస్టరుగారితో గల అనుభవాలను 'ఆచార్యుని అద్భుతలీలలు' అను శీర్షికకు, శ్రీ సాయినాథునితో గల అనుభవాలను 'ద్వారకామాయి అనుభవమండపము' అను శీర్షికకు పంపగలరని మనవి.

ఇట్లు
ఎడిటర్.

SRI GURUPADUKA PUBLICATIONS,
C/O SRI MANGA BHARADWAJA TRUST,
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 450-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 50-00 |
| ఏది నిజం? | 50-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 128-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము-మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2) | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master(Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's SaiBaba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba(Hindi) | 150-00 |
| Sai Leelamrutham(Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham(Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 99-00 |
| Sri Guru Charitra(Kannada) | 45-00 |
| Shiridi Aarathi(Tamil) | 15-00 |
| Stavana Manjari(Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |


**SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,**

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : +91 - 74160 41550

Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.

Phone: 08592 233271

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.**

# మనము - మన సంస్కృతి



పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి (18-02-2022)

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.